హైదరాబాద్ వార్త



# సుప్రీంకోర్టు తీర్పును రాష్ట్రంలో అమలు చేయాలి

తెలంగాణ ట్రాన్స్‌జెండర్ల జేఏసీ



సమావేశంలో మాట్లాడుతున్న జేఏసీ ప్రతినిధులు

హైదరాబాద్, జనవరి 9, (ప్రభాతవార్త): ట్రాన్స్ జెండర్లకు సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం తెలంగాణ రాష్ట్రంలో రిజర్వేషన్లు అమలు చేయాలని తెలంగాణ ట్రాన్స్‌జెండర్ జేఏసీ డిమాండ్ చేసింది. ఈమేరకు సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జేఏసీ ప్రతినిధులు మేకల హర్షిత , వైజయంతి, ఓరుగంటి లైలా, చంద్రముఖి, కృష్ణమ్మ తదితరులు మాట్లాడారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ట్రాన్స్ జెండర్లు కేవలం భిక్షాటన కోసం మాత్రమే బతకడం లేదని, తమకు ఆత్మగౌరవంతో బతకడానికి కావాల్సిన అవకాశాలు కావాలన్నారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం రిజర్వేషన్లను తెలంగాణ ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ట్రాన్స్ జెండర్ ప్రొటెక్షన్ యాక్ట్ 2019లో పేర్కొన్న అన్ని అంశాలను పరిగణలోకి తీసుకుని అమలు చేయాలన్నారు. చట్టం వచ్చి మూడేళ్లు దాటినా ఇంకా చట్టం సమగ్రంగా అమలు కావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. తమకు ఉద్యోగ నియామకాల్లో సెపరేట్ ప్రమాణికాలు, బహిరంగ ప్రదేశాల్లో ప్రత్యేక టాయిలెట్స్ కేటాయించాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టే పోలీస్ రిక్రూట్‌మెంట్‌లో తమకు వేరుగా ఈవెంట్స్ జరపాలని డిమాండ్ చేశారు.

# టిఎస్ఎస్పీడిసిఎల్‌లో హైటెక్ సేవలు

**గ్రేటర్‌లో ఐదు చోట్ల ఆటోమేటిక్ సబ్‌స్టేషన్ల ఏర్పాటు**

**సిబ్బంది అవసరం లేకుండా పర్యవేక్షించే ఆధునికత**

**అంతర్గత నిర్వహణ ఖర్చులు,**

**మానవ ప్రమేయాన్ని తగ్గించే అవకాశం**

**ఇప్పటికే సాసాయాప్, ఓఎంఎస్,**

**స్కాడా టెక్నాలజీ వినియోగిస్తున్న డిస్కం**

హైదరాబాద్, జనవరి 9, (ప్రభాతవార్త): దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టిఎస్ఎస్పీడిసిఎల్) సాంకేతిక వినియోగంలో దూసుకెళ్తుంది. ఇప్పటికే మీటర్ రీడింగ్, కరెంట్ బిల్లుల వసూళ్లు, ఫిర్యాదుల స్వీకరణ ఆధునిక టెక్నాలజీ వినియోగిస్తున్న సంస్థ తాజాగా విద్యుత్ సరఫరాలోని కీలకమైన సబ్‌స్టేషన్లపై దృష్టి సారించింది. అంతర్గత నిర్వహణ ఖర్చులు, మానవ ప్రమేయాన్ని తగ్గించేందుకు కొత్తగా ఆటోమేటిక్ సబ్‌స్టేషన్లను అందు బాటులోకి తెస్తుంది. ఇప్పటికే గ్రేటర్ పరిధిలోని కల్యాణ్ నగర్, ముఫకంజా, శిల్పారామం, కృష్ణానగర్, నాగోల్‌లో సబ్‌స్టేషన్ల నిర్మాణ పనులు ప్రారంభించింది. సాధారణంగా ప్రతిసబ్‌స్టేషన్‌లో నాలుగు నుంచి ఆరు గురు విద్యుత్ సిబ్బంది పనిచేస్తుంటారు. సబ్ స్టేషన్‌కు అందుతున్న దాని నుంచి సరఫరా అవుతున్న విద్యుత్ తీరును నిరంతరం పర్యవేక్షిస్తుంటారు. ఎవరైనా ఫీడర్ ట్రిప్ అయితే వెంటనే సరిచేస్తుంటారు. అయితే ఒక్కో సబ్‌స్టేషన్‌లోని సిబ్బంది జీతాలన్నీ కలిపి రూ.లక్షల్లో ఉండటం, జీహెచ్ఎంసి పరిధిలలో వందలాది సబ్‌స్టేషన్లు ఉండటంతో టిఎస్ఎస్పిడిసిఎల్‌పై ప్రతినెలా రూ.కోట్లల్లో ఆర్థిక భారం పడుతుంది. ఈనేపథ్యంలో అందుబాటులోకి తెస్తున్న అన్‌మ్యాన్డ్ సబ్‌స్టేషన్‌లో సిబ్బంది అవసరం ఉండదు. పూర్తిగా సాఫ్ట్‌వేర్ సాయంతోనే ఇవి పనిచేయను న్నాయి. విద్యుత్ సరఫరా రీడింగ్ వివరాలు ఎప్పటి కప్పుడు ఆటోమేటిక్‌గా నమోదు చేసుకో నున్నాయి. అలా గే ఫీడర్ పరిధిలో ఎక్కడ సమస్య వచ్చి నా వాటంతట అవే పరిష్కరించనున్నాయి. ప్రతి 10-15సబ్‌స్టేషన్ల పని తీరును ఒక అసిస్టెంట్ ఇంజనీర్ పర్య వేక్షిస్తే సరిపో తుంది. దీనివల్ల సంస్థపై ఆర్థిక భారం గణనీయంగా తగ్గనుంది.



**ఉత్తమ సేవలు అందించడమే లక్ష్యం**

**టిఎస్ఎస్పీడిసిఎల్ సిఎండీ రఘుమారెడ్డి**



గృహ వినియోగదారులు, వ్యాపారులు, రైతులకు, పరిశ్రమలకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్నాం. అలాగే వినియోగదారులకు విద్యుత్ సేవలు మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో ఆధునిక టెక్నాలజీ ప్రవేశపెడుతున్నాం. ఫలితంగా ఈ ఎనిమిదేళ్లలో డిస్కంకు 34 జాతీయ అవార్డులు లభించాయి. భవిష్యత్‌లోను వినియోగదా రులకు ఉత్తమ సేవలు అందించేందుకు కొత్తగా వచ్చే ప్రతి నూతన టెక్నాలజీ వ్యవస్థలను వినియోగించేందుకు కృషి చేస్తాం.

**ఇప్పటికే సాసాయాప్, ఓఎంఎస్,**

**స్కాడా టెక్నాలజీ వినియోగం**

విద్యుత్ సమస్య తలెత్తినప్పుడు కాల్‌సెంటర్ నంబర్ 1912 ద్వారా అందే ఫిర్యాదును సం బంధిత సెక్షన్ అధికారికి పంపేందుకు "సాసా" యాప్ వినియోగం గతంలో కాల్‌సెంటర్ ద్వారా ఒకే సమయంలో 30కాల్స్ మాత్రమే రిసీవ్ చేసుకునే అవకాశం ఉండగా ప్రస్తుతం ఏకకాలంలో 300ఫిర్యాదులు స్వీరణకు అవకా శం. అలాగే 11కెవీ, 33కెవీ ఫీడర్లలో విద్యుత్ అంతరాయాల పునరుద్ధరణకు కంప్యూటర్ ఆధారిత అవుటేజ్ మేనేట్‌మెంట్ సిస్టం (ఓఎంఎస్) వాడుతున్నారు. దీని సాయంతో విద్యుత్ పునరుద్ధరణ ఎక్కడికి ఎంతమంది సిబ్బందిని పంపాలో ముందే గుర్తించే వీలు ఉంటుంది. సెల్ఫ్ మీటర్‌రీడింగ్ యాప్ ద్వా రా వినియోగదారుడే స్వయంగా ఇంటోని మీటర్‌లో నమోదైన రీడింగ్‌ను తీసు బిల్లు పొందే వెసులుబాటు ఉంది. అలాగే జిహెచ్ ఎంసి పరిధిలో 226సబ్‌స్టేషన్లు, 167 ఫీడర్ల లో రియల్ టైమ్‌లో విద్యుత్ గణాంకాల విశ్లేషణకు సూపర్‌వైజరీ కంట్రోల్ అండ్ డేటా అక్విజిషన్ (స్కాడా) సాంకేతిక అందుబాటు లోకి వచ్చిది. క్షేత్రస్థాయి నుంచి ఫిర్యాదులు రాకపోయినా దీని ద్వారా ఆటోమేటిక్‌గా సరఫ రాను పర్యవేక్షించే వీలు ఉంటుంది. కరెంట్ పోయినా ప్రాంతాల వివరాలు గుర్తింపు, క్షేత్రస్థాయి సిబ్బందిని అప్ర మత్తం చేయడం దీని ప్రత్యేకత. జిహెచ్ఎంసి పరి ధికే పరిమితమైన ఈసేవలు 2023లో గ్రేటర్ శివారు ప్రాంతాలకు ఆతర్వాత ఇతర జిల్లాలకు ఈసేవలు విస్తరిం చాలని నిర్ణయం తీసుకున్నట్లు ఉన్నతాధికారులు తెలుపుతున్నారు.

# చలికి వణికిపోతున్న సిటీజనులు

**రోజురోజుకూ తీవ్రం ● మరో రెండు రోజులు ఇదే తీవ్రత**

హైదరాబాద్, జనవరి 9 ప్రభాతవార్త : నగరంలో చలి తీవ్రత పెరిగింది. ఈశాన్య దిశ నుంచి వీస్తునన చలిగాలులతో నగరవాసులు గజగజ వణుకుతున్నారు. రాత్రి, పగలు అనే తేడా లేకుండా ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పడిపోయాయి. మరో రెండు రోజులు ఇదే తరహా చలి వాతావరణం ఉంటుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది సోమవారం కనిష్ట ఉష్ణోగ్రత 11 డిగ్రీలు నమోదైంది. ఇప్పటి వరకు ఈ శీతాకాలంలో ఇదే అత్యల్పం. రాత్రి ఉష్ణోగ్రతలు మరింత పడి పోయే అవకాశం ఉందని వాతావరణ శాఖ చెబుతోంది. చలి గాలుల తీవ్రత మరో రెండు మూడు రోజులు ఉండే అవకాశం ఉందని వాతావరణ శాఖ చెబుతోంది. ఉత్తరాదిలో ఉష్ణోగ్ర తలు పడిపోయి చలి తీవ్రత పెరగడంతో అక్కడి నుంచి వీస్తున్న గాలులతో చలి ప్రబావం ఇక్కడ కన్పిస్తోంది. నగరం మీదకు వీస్తున్న గాలులతో కనిష్ట, గరిష్టి ఉష్ణోగ్రతలు పడిపోయాయి. నగరవ్యాప్తంగా వారం రోజులుగా పగటి పూట ఉష్ణోగ్రతలు క్రమంగా పడిపోతున్నాయి. పగటిపూట చలి గాలులు వణికిస్తు న్నాయి. దీంతో అన్ని ప్రాంతాల్లో చలి ప్రభావం తీవ్రంగా ఉంది. ఈ నేపథ్యంలో ప్రజలు రాత్రి చీకటిపడినప్పటి నుంచి ఉదయం సూర్యుడు వచ్చే వరకు ఇళ్లలోంచి బయటకు రావడం లేదు. చలి కారణంగా జలుబు, దగ్గు లక్షణాలతో పాటు



శ్వాసకోశ సమస్యలున్నవారు, రోగులు, చిన్నారులు, వృద్ధులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చలి తీవ్రత పెరిగిపోవడంతో జనాలు స్వెట్టర్, మంకీ క్యాప్, జర్కిన్‌లు, చేతిగ్లౌజులు, మఫ్లర్ లేనిదే బయటకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. చలితీవ్రత పెరగడంతో పలు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తు న్నారు. ఊపిరితిత్తుల సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న వారిలో అయితే దీని ప్రభావం మరీ అధికం. జలుబు, ముక్కు, దిబ్బడ, ముక్కు కారడం, చర్మసంబంధమైన సమస్యలు వేధి స్తుంటాయి. మరీ ముఖ్యంగా చలిలో బయట ఉన్నప్పుడు శరీరంలో వణుకువస్తే దాన్ని తేలిగ్గా తీసుకోవద్దని వైద్యులు పేర్కొంటున్నారు.

# పాతికేళ్లకే గుండెకు గండం..!

**ఆరోగ్యంగానే కనిపిస్తూ కుప్పకూలిపోతున్న వైనం**

**ఛాతీ, కడుపు, తలనొప్పి మాటున అసలు సమస్య**

**ఎముకలు కొరికే చలి గుండెనూ పిండేస్తోంది**

**పొంచి ఉన్న ప్రమాదం అప్రమత్తత అవసరం**

హైదరాబాద్, జనవరి 9 ప్రభాతవార్త : "కర్ణాటకలోని మడికేరి జిల్లాలో కీర్తన్ అనే బాలుడు ఆరో తరగతి చదువుతున్నాడు. కళ్ల ముందే హుషారుగా ఆడుకున్నక పన్నెండేళ్ల బాలుడు ఒక్కసారిగా గుండెపోటుతో విలవిల్లాడిపోయాడు. తల్లిదండ్రులు వెంటనే ఆస్పత్రికి తరలించినా.. పరీక్షించిన వైద్యులు గుండె పోటువల్ల అప్పటికే చనిపోయినట్లు ధృవీకరించారు. కీర్తన్‌కు ఇప్పటి వరకు ఎలాంటి అనారోగ్య సమస్య లేదని బంధువులు తెలిపారు. 'రామంతపూర్‌కు చెందిన ఉమామహేశ్వర్ ప్రైవేటు ఉద్యోగి. అయనకు భార్య, ఇద్దరు పిల్లలు, వృద్ధులైన తల్లిదండ్రులు ఉన్నారు. వీరంతా ఉమామహేశ్వర్‌పైనే ఆధారం. ఉదయమే ఆఫీసుకు వెళ్లేందుకు ఆయన ఇంట్లో నుండి బయటకు రాగానే ఛాతిలో నొప్పితో గుండె నొప్పి రావడంతో అక్కడే కుప్పకూలిపోయాడు'.. 'ఉప్పల్‌కు చెందిన బుర్ర వెంకటేశ్వర్లు సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. పనిలో చాలా చురుకు, ఒక్కసారిగా తల నొప్పి, ఛాతిలో కాస్త నొప్పి అనిపించింది. వైద్యుడి వద్దకు వెళ్ళగా ఈసీజీలో గుండె నొప్పి లక్షణమని తేలింది. వెంటనే ఆసుపత్రిలో చేరి చికిత్స పొందడంతో ప్రాణా పాయం నుంచి బయటపడ్డాడు'.. ఇలా పాతికేళ్ళ ప్రాయం.. నిండు యవ్వనం, రాళ్లు తిన్నా అరిగిపోయే వయసు.. ఉజ్వల భవిష్యత్ ఉన్నవారు.. అలాంటివారు అకస్మాత్తుగా గుండెపోటు కు గురవుతున్నారు. నొప్పి తీవ్ర స్థాయిలో ఉంటుండటంతో ప్రాణాలు వదులుతున్నారు. కొందరు వ్యాయామం చేస్తూ అస్వస్థతకు గురై, ఆసుపత్రులలో చేరి మృతి చెందిన పలు ఉదంతాలు కనిపిస్తూనే ఉన్నాయి. అయితే ఇబ్బందిని వెంటనే గుర్తించిన కొందరు ఆసుపత్రిలో చేరి ప్రాణం నిలుపుకుంటు న్నారు. ఛాతిలో ఇబ్బందిగా అనిపిస్తే చాలామంది యువకులు సాధారణమేనని భావిస్తున్నారు. తలనొప్పి వస్తే సొంతంగా మందులు కొనుక్కొని వాడుతున్నారు. కడుపులో నొప్పి వస్తే అసిడిటీ అనుకొని ఇతర వైద్యుల వద్దకు వెళ్తున్నారు. కానీ ఛాతినొప్పిని గుండె సమస్య లక్షణాలని అంచనా వేయలేకపోతు న్నారు. దీంతో చికిత్స ఆలస్యమై ప్రాణాపాయ స్థితికి దారితీ స్తోందని వైద్యులు చెబుతున్నారు. గుండె నొప్పి ఏ కారణం ఏ లక్షణంతో ఉంటుందో తెలియని పరిస్థితి కూడా దీనికి కారణ మని కార్డియాలజిస్టులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం కార్డియో వాస్కులర్ జబ్బులు బాగా పెరిగాయి. ముఖ్యంగా మహిళల్లో బాధితుల సంఖ్య ఎక్కువగా ఉంటోంది.

మారిన జీవన శైలి, దూమపానం, మాదక ద్రవ్యాల వినియోగం కొంతమంది యువతలో పెరిగిపోయింది. ధూమ పానం వల్ల రక్తాన్ని సరఫరా చేసే నాళాలు కుంచించుకుపోయి గుండె నొప్పికి గురవుతున్నట్లు వైద్యులు తెలిపారు. ఆహార అలవాట్ల కారణంగా చిన్న వయసులోనే గుండె జబ్బులు



తలెత్తుతున్నాయి. గుండె రక్త నాళాల్లో పూడికలు (బ్లాక్స్) ఏర్పడి కరోనరీ హార్ట్ డిసీజ్‌కు దారితీస్తోంది. 25 ఏళ్ళ వయ సుకే రక్త నాళాల్లో పూడికల కారణంగా గుండె శక్తి సామర్థ్యాలు తగ్గుతున్నాయి. స్టెంట్లు, యాంజియో ప్లాస్టీ చేయించుకునే వారి సంఖ్య పెరుగుతోంది. మధుమేహం, అధిక రక్తపోటు, అధిక బరువు, కొలెస్ట్రాల్ కారణంగానూ గుండె జబ్బులు పెరుగుతు న్నాయి. చలి కాలంలో అనారోగ్య సమస్యలు ఎక్కువగా వచ్చే ప్రమాదం ఉంది. ముఖ్యంగా చలి కాలంలో అప్రమత్తత అవసరమని గుండె వ్యాధి నిపుణులు సూచిస్తున్నారు. గుండె రక్తనాళాల్లో ఒక్కసారిగా విస్ఫోటం జరగడానికి చలికాలంలో అవకాశాలెక్కువ. చలి తీవ్రత ఎక్కువగా ఉన్నప్పుడు రక్తం చిక్కబడుతుంది. శ్వాస నాళాలు కుదించుకుపోయినట్లే గుండె ల్లోని రక్తనాళాలు కూడా ముడుచుకుపోతాయి. రక్తపోటులో మార్పులు చోటు చేసుకుంటాయి. ఫలితంగా రక్తసరఫరా కోసం గుండె ఎక్కువగా శ్రమించాల్సి వస్తుంది. ఈ నేపథ్యంలో చలికాలంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

ఛాతిలో హఠాత్తుగా నొప్పి రావడమనేది అత్యంత అరుదుగా జరిగే విషయం. చాలా సందర్భాల్లో గుండె నొప్పి మెల్లగా మొదలై ముందుకు, వెనక్కు, పక్కలకు పాకుతూ ఉంటుంది. ఛాతిలో నొప్పి అని చెప్పలేం కానీ ఏదో అసౌకర్యంగా ఉంటుంది. తగ్గిపోతూ, మళ్ళీ వస్తూ ఉండడంతో నిర్లక్ష్యం చేసే ప్రమాదం ఉంది. సాధారణంగా ఛాతి మధ్యలో మొదలైన నొప్పి ఎడమ వైపు వెనక్కు వెళుతూ ఉంటుంది. అప్పుడప్పుడు కుడి వైపు, ఒక్కోసారి రెండు వైపులకీ వ్యాపిస్తూ ఉండవచ్చు. ఇంకొన్ని సందర్భాలలో ఎడమ భుజం నుంచి మణికట్టు వరకు తిరుగుతూ ఉంటుంది. ధూమపానం, పొగాకు ఉత్పత్తులు తీసుకోవడం వల్ల త్వరగా గుండె జబ్బులు వచ్చే ప్రమాదముంది. ఇతరులతో పోలిస్తే పొగ తాగేవారిలో గుండె పోటు ముప్పు 10రెట్లు ఎక్కువ. ఇంట్లో ఒకరు ధూమపానం చేస్తే అది కుటుంబసభ్యులందరికీ గుండెజబ్బు తెచ్చిపెడుతుంది. వైద్యుల వద్దకు వచ్చే గుండె జబ్బుల బాధితుల్లో 30 నుండి 40శాతం యువత ఉంటున్నారు. డ్రగ్స్ వాడేవారిలో రక్తనాళాలు కుంచించుకుపోయి రక్త ప్రసరణ సరిగా ఉండడంలేదు. కుటుంబంలో తల్లికి 65 ఏళ్ళ వయసులో తండ్రికి 55 ఏళ్ళ వయసులో గుండె నొప్పి వస్తే వారి పిల్లలకు ముప్పు త్వరగా పొంచి ఉంటుంది.

# లారీ ఢీ కొట్టి.. భార్య కళ్ల ముందే భర్త దుర్మరణం

**డ్రైవర్‌ను అదుపులోకీ తీసుకున్న పోలీసులు**



లారీ ఢీకొట్టిన సంఘటనలో మృతి చెందిన కర్ణాటకు చెందిన రతన్

చార్మినార్, జనవరి 9 ప్రభాతవార్త : రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని ఆరాంఘర్‌లో సోమవారం ఉదయం లారీ బీభత్సం సృష్టించింది. బస్సు కోసం ఎదురు చూస్తున్న కర్ణాటక రాష్ట్రానికి చెందిన భార్యభర్తలను లారీ ఢీ కొట్టింది. ఈ సంఘనలో భార్య కళ్ల ముందే భర్త చని పోగా తీవ్ర గాయాల పాలైన భార్య ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నది. రాజేంద్ర నగర్ పోలీసుల కథనం ప్రకారం.. కర్ణాటకలోని కలబర్గ జిల్లా సేడం ప్రాంతానికి చెందిన రతన్ (35), మంజుల (32) భార్య భర్తలు. కాగా రతన్ రాజేంద్రనగర్‌లోని పాండు రంగానగర్‌లో నివాసం ఉంటూ కూలి పని చేస్తూ జీవ నాన్ని సాగిస్తున్నాడు. భార్య పిల్లలు కర్ణాటకలోని స్వంత ఊరిలో ఉంటున్నారు. భర్తను చూడటానికి భార్య మంజలు పాండు రంగానగకు వచ్చింది. సోమవారం ఉదయం తెల్లవారు జామున భర్త రతన్ తన భార్య మంజులను బస్సు ఎక్కించటానికి హైదర్‌గూడ చౌరస్తా వద్దకు తీసుకు వచ్చాడు. భార్యభర్తలు బస్సు కోసం అక్కడ ఎదురు చూస్తున్నారు. అదే సమయంలో ఆరాంఘర్ చౌరస్తా నుంచి మెహిదీపట్నం వైపు వెళ్తున్న లారీ భార్య భర్తలను ఢీకొట్టింది. ఈ సంఘటనలో భర్త రతన్ సంఘటన స్థలంలోనే మృతి చెందగా గాయాల పాలైన భార్య మంజుల నాలానగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రి లో ప్రస్తుతం చికిత్స పొందుతున్నది. చనిపోయిన రతన్‌కు ఇద్దరుకు మార్తెలు, కుమారుడు కలరు. కాగా ప్రమాదానికి కారకుడైన యుపిలోని ఖుతాలి ఆజాంఘర్‌కు చెందిన లారీ డ్రైవర్ పురుషోత్తం యాదవ్‌ను అదుపులోకీ తీసుకుని విచారిస్తున్న ఎస్ఐ శ్వేత తెలిపారు. ఈ కేసును రాజేంద్రనగర్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌ను సందర్శించిన బండి సంజయ్, లక్ష్మణ్



సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో అధికారులతో కలసి పర్యవేక్షిస్తున్న బండి సంజయ్ ఇతర నేతలు

మెట్టుగూడ, జనవరి 9 ప్రభాతవార్త: ఈ నెల 19న సికింద్రా బాద్ రైల్వే స్టేషన్ వద్ద వందేభారత్ ట్రైన్ ప్రారంబోత్స వానికి ప్రధాని నరేంద్రమోది రానున్న నేప థ్యంలో సోమ వారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్, రాజ్యసభ సభ్యులు డా. లక్ష్మణ్ రైల్వే అధికారలుతో పర్యటించారు. ప్రధాని అభివృద్ధి కార్యక్రమాల ప్రారంబోత్స వానికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు వారు స్టేషన్‌ల్లో పర్యటించి సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. బండి సంజయ్‌తో పాటు మాజీ మేయర్ బండకార్తిక చంద్రాడ్డి, జీఎం అరుణ్‌కుమార్ జైన్, సికింద్రాబాద్ డీఆర్ఎం అభయ్‌కుమార్ గుప్త, జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి, సీపీఆర్వో సిహెచ్. రాఖేష్‌తో పాటు పలువురు బిజేపీ నేతలు పాల్గొన్నారు.

# కెసిఆర్ పథకాలు దేశంలో ఎక్కడా లేని విధంగా అమలౌతున్నాయి : పద్మారావు గౌడ్



అడ్డగుట్టలో కళ్యాణ లక్ష్మీ చెక్కులను అందజేస్తున్న డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్, కార్పోరేటర్ లింగాని ప్రసన్న శ్రీనివాస్

అడ్డగుట్ట, డిసెంబర్ 9 ప్రభాత వార్త: తెలంగాణలో ముఖ్య మంత్రి కేసిఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథ కాలు దేశంలో ఎక్కడా లేని విధంగా అమలౌ తున్నా యని అసెంబ్లీ డిప్యూ టీ స్పీకర్ పద్మా రావు గౌడ్ తెలిపారు. సోమవారం అడ్డగుట్ట డివిజన్‌లోని వివిధ ప్రాంతాల్లో నివాఎసం ఉంటున్న 51 మందికి మంజూరైన కళ్యాణ లక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను, 22 మందికి సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పద్మారావు గౌడ్‌తో పాటు అడ్డగుట్ట డివిజన్ కార్పోరేటర్ లింగాని ప్రసన్న శ్రీనివాస్‌తో కలిసి ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఆయా ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను స్థానికులు పద్మారావు దృష్టికి తెచ్చారు. వెంటనే ఆయన స్పందించి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను అదేశాలు జారీ చేశారు. 6 గంటల పాటు విస్తృతంగా అడ్డగుట్టలో పర్యటించి లబ్ధిదారులకు చెక్కులను అందజేయడంతో పాటు ప్రజా సమస్యలు తెలుసుకోవడంతో పద్మారావు గౌడ్ పర్యటనకు అనూహ్యస్పంద ఏర్పడింది.

**ఏసీఎస్ నగర్‌లో డ్రైనేజీ పనులను ప్రారంభించిన డిప్యూటీ స్పీకర్**

ఆజాద్ చంద్రశేఖర్ నగర్‌లో 8 లక్షల రూపాయల వ్యయంతో ఏర్పాటు చేయ నున్న డ్రైనేజీ నిర్మాణం పనులను డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్, అడ్డగుట్ట డివిజన్ కార్పోరేటర్ లింగాని ప్రసన్న శ్రీనివాస్ తలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జలమండలి జిఎం రమణా రెడ్డి, డిజి.ఎం.క్రిష్ణ, ఏఈ శ్రవంతి, గ్రంథాలయ డైరెక్టర్ లింగాని శ్రీనివాస్, టిఆర్ఎస్ నేతలు నక్క మధు, పెండెం మనోహర్, వై.సత్తయ్య గౌడ్, హన్మంత్ గౌడ్, శ్రీనివాసస్ గౌడ్, అమర్, పొన్నాల రాజు, బండ నర్సింగ్, మల్లేశ్, శివశంకర్, మహ్మద్, గంగపుత్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కైరం కొండ యాదగిరి తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆజాద్ చంద్రశేఖర్ నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన బిఆర్ఎస్ జెండాను పద్మారావు గౌడ్ అవిష్కరించారు.

# సర్పంచుల దీక్షకు సంఘీభావం తెలిపిన పాతబస్తీ కాంగ్రెస్ నాయకులు

చార్మినార్, జనవరి 9 ప్రభాతవార్త : సర్పంచుల హక్కులను తెలంగాణ ప్రభుత్వం కాలరాస్తోందని చార్మినార్ నియోజకవర్గం సీనియర్ కాంగ్రెస్ నాయకులు కె.వెంకటేష్ అన్నారు. హైదరాబాద్ ఇందిరా పార్కు ధర్నా చౌక్ వద్ద సోమవారం కాంగ్రెస్ పార్టీ పంచాయతీ రాజ్ సంఘటన్ ఆధ్వర్యంలో సర్పంచుల సమస్యలపై చేపట్టిన మహా ధర్నాలో కాంగ్రెస్ నాయకుడు వెంకటేష్ పాల్గొని టిపీసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.అంజన్ కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కోదండ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ మహ్మద్ షబ్బీర్ అలీలకు పార్టీ ఖండువాలు కప్పి తన సంఘీభావాన్ని తెలిపారు. పాతబస్తీకి చెందిన పల వురు కాంగ్రెస్ నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# సైనిక శిక్షణలో అగ్నివీర్‌లు

**ఆర్టిలరీ సెంటర్‌లో కొనసాగుతున్న శిక్షణ**

అల్వాల్, జనవరి 9 ప్రభాతవార్త: సైన్యంలో యువ రక్తాన్ని నింపే ఉద్దేశ్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన అగ్నివీర్ పథకం రిక్రూట్‌మెంట్‌ను దాటుకుని శిక్షణ వరకు వచ్చింది. హైదరాబాద్‌లోని ఆర్టిలరీ సెంటర్‌లో 2వేల 260 మంది యువత శిక్షణ తీసుకుంటున్నారు. ఈ నెల 2వ తేది నుంచి త్రివిధ దళాలు కోసం ఎంపిక చేసిన అగ్నివీర్ శిక్షణ వివిధ సైనిక విభాగలులో కొనసాగుతోంది. సోమవారం నగరంలోని ఆర్టిలరీ సెంటర్‌లో అగ్నివీర్ శిక్షణ పరిశీలనకు మీడియాకు అవ కాశం కల్పించింది రక్షణశాఖ. సెంటర్ కమాండెంట్ బ్రిగేడియర్ రాజీవ్ చౌహాన్ ప్రత్యక్ష పర్యవేక్షణలో శిక్షణ కొనసాగుతోంది. 31 వారాలు పాటు అగ్నివీర్‌లు శిక్షణ తీసుకుంటారు. శిక్షణ అనంతరం దేశంలోని సైనిక విభాగాలులో పోస్టింగ్ ఇవ్వడం జరుగుతుంది. శారీరక మానసిన దారుడ్యానికి సంబంధించి మొదటి దశలో శిక్షణ ఉంటుంది. విపత్కర పరిస్థితులను ఎదు ర్కొనే విధంగా తయారు చేస్తారు. ప్రాథమిక శిక్షణ అనంతరం సుశిక్షితుడైన సైనికుడికి అవసరమైన అంశాలులో తర్ఫీదు ఉం టుంది. కాంబాట్ యుద్ధంలో కావాల్సిన మెళుకవలు ఇందులో ఉంటాయి. దేశ భద్రత కోసం ప్రాణ త్యాగం చేసే అగ్నివీర్‌లను సృష్టించడం ఈ దశలోనే ఉండగా దీనినే అడ్వాన్స్ మిలటరీ ట్రైనింగ్ అని పిలుస్తారు. ఆధునిక సాంకేతికతతో కూడిన గన్స్ వాడకంతో పాటుగా ఐటి సాంకేతిక పరిజ్ఞానం ఇంగ్లీషు బోధన ఉంటుంది. సైబర్ సెక్యూరిటీ కాంబాట్ నేవిగేషన్‌లో మెళుకవలు మానసికంగా ఉల్లాసంగా ఉంచే విధానంలో బాగంగా క్రీడలులో వీరికి శిక్షణ ఇస్తారు. దేశరక్షణ కోసం సుశిక్షితుడైన అగ్నివర్‌లు తయారీలో ఆర్టిలరీ సెంటర్ కీలక పాత్ర పోషిస్తోంది. సైనికాధికా రులు అగ్నివీర్‌లు తీసుకుంటున్న శిక్షణా ప్రదేశాలుతో పాటుగా వారి వసతులకు సంబంధించి మీడియాకు చూపించడం జరిగిం ది. మిలాప్ సెంటర్ రిసెప్షన్ సెల్ డైనింగ్ హాల్ హాస్టల్ క్షవరశాలతో పాటుగా సిమ్యులేటర్ సెంటర్ డ్రిల్ శారీరక దారుడ్యానికి చెందిన జిమ్‌లు ఇందులో ఉన్నాయి.

# ప్రగతిభవన్ ముట్టడి.. విద్యార్థి నాయకుడి అరెస్టు

తార్నాక, జనవరి 9 ప్రభాతవార్త: ఎస్సై, కానిస్టేబుల్ నియమకాల్లో అవకత వకలు జరిగాయని ఆరోపిస్తూ అందుకు నిరసనగా ప్రగతిభవన్ ముట్టడికి ప్రయత్నించే క్రమంలో సోమవారం ఓ.యూ నిరుద్యోగ విద్యార్థి నాయకుడు చనగాని దయాకర్‌ను పోలీ సులు ఎన్‌సీసీగేట్ వద్ద అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా దయాకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో మానవ హక్కులను కాల రాస్తున్నారని ఆరోపించారు. నేడు నిరు ద్యోగుల సమస్యల గురించి మాట్లా డే పరిస్థితిలేదన్నారు.

# న్యాయవాదిపై దాడి చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలి

**తెలంగాణ అడ్వకేట్ జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి**

ధర్నాచౌక్, జనవరి 9, ప్రభాతవార్త: హన్మకొండకు చెందిన న్యాయవాది కొత్తపల్లి రాజుపై దాడి చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ అడ్వకేట్ జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం న్యాయవాదులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ తెలంగాణ రాష్ట్ర జిల్లాల న్యాయవాద సంఘాలు ఇచ్చిన పిలుపులో భాగంగా రంగారెడ్డి జిల్లా కోర్టు న్యాయవాదులు తమ విధులను బహిష్కరించి, నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ నిజామాబాద్ జిల్లా న్యాయవాద సంఘం అధ్యక్షులు గణపతి మరియు ఇద్దరు కోర్టు బెలిఫ్స్ తమ విధుల్లో భాగంగా అదనపు జిల్లా జడ్జి ఇచ్చిన ఆదేశాల మేరకు జిల్లా అధికారులను సంప్రదిస్తే నిర్లక్ష్యంగా వ్యవహరించటమే కాకుండా, జిల్లా జడ్జిని దుర్భాషలాడుతూ గణపతి, బెలిఫ్స్ పై కేసు పెట్టటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. హన్మకొండలో న్యాయ వాది కొత్తపల్లి రాజు, ఆసుపత్రిలో ఉన్న తన స్నేహితుడి తండ్రిని చూసేందుకు వెళ్లి వస్తూ ఉండగా ఎస్ఐ ఇమ్రాన్, తన సిబ్బందితో కలసి ఎటువంటి కారణం లేకుండా లాఠీతో విచ క్షణా రహితంగా కొట్టటమే కాకుండా న్యాయవాద వృత్తిని తూల నాడటాన్ని నిరసిస్తూ ఈ రోజు విధులను బహిష్కరించామని తెలిపారు. ఈ నిరసన కార్యక్రమంలో జిల్లా న్యాయవాద సంఘం అధ్యక్షులు జి.సుధాకర్‌రెడ్డి, నాయకులు విజయదేవ రాజ్, వేణుగోపాల్ రెడ్డి, బార్‌కౌన్సిల్ మెంబర్స్ విష్ణువర్ధన్ రెడ్డి, ఏ.అనంతసేన్, వై.కొండల్ రెడ్డి, సుధారాణి, ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

**ఎమ్మెల్యే సాయన్న సహకారంతో 2వ వార్డు అభివృద్ధికి కృషి**

కంటోన్మెంట్, డిసెంబర్ 9 ప్రభాతవార్త: కంటోన్మెంట్ నియోజ కవర్గం ఎమ్మెల్యే జి.సాయన్న సహాయ సహకారాలతో 2వ వార్డులోని వివిధ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యల పరిష్కా రానికి కృషి చేస్తానని బోయిన్‌పల్లి మార్కెట్ మాజీ చైర్మన్ టీ.ఎన్.శ్రీనివాస్ తెలిపారు. సోమవారం 2వ వార్డులోని రసూల్‌పురా, క్రిష్ణా నగర్ కాలనీ, కట్టమైసమ్మ ప్రాంతాల్లో ప ర్యటించి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా శాంతి భద్రతల పరిరక్షణకు, నేరాల అదుపుకు సీసీ కెమరాలు కూడా ఏర్పాటు చేస్తామని టీ.ఎన్.తెలిపారు. బేగంపేట్ సిఐ శ్రీనివాస్ రావ్, టిఆర్ఎస్ నాయకుడు కుమార్ ముదిరాజ్, అంజనేయులు, కుమార్ గౌడ్ పాల్గొన్నారు.

## సివరేజి పైప్‌లైన్ పనులు ప్రారంభించిన కార్పొరేటర్

సికింద్రాబాద్, జనవరి 9 ప్రభాతవార్త : డివిజన్‌ను అన్ని విధాల అభివృద్ధి పర్చడమే లక్ష్యంగా పని చేస్తున్నామని సీతాఫల్‌మండి డివిజన్ కార్పొరేటర్ సామలహేమ తెలిపారు. డివిజన్‌లోని న్యూ షాబాద్‌గూడ సంతోష్‌నగర్‌లో రూ. 6.5 లక్షలతో సివరేజి పైప్‌లైన్ నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అభివృద్ధి పనులు జరుగుతున్న సమయంలో స్థానికులు పనులను దగ్గరుండి పర్యవేక్షించుకోవాలని కోరారు. పనులు పూర్తయ్యక సక్రమంగా జరుగలేదని బాధపడే అవసరం ఉండదని అన్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి డీజీఎం వై. కృష్ణ, శ్రీకాంత్, నేతలు కరాటేరాజు, రాజుసాగర్ పాల్గొన్నారు.

## ముగ్గుల పోటీ విజేతలకు బహుమతులు


బహుమతులు అందిస్తున్న నందికంటి శ్రీధర్

అల్వాల్, జనవరి 9 ప్రభాతవార్త: సంక్రాంతిని పురస్కరించుకుని నందికంటి శ్రావణ్ కుమార్ పౌండేషన్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు జరిగాయి. మచ్చబొల్లారం డివిజన్ పరిధిలోని మహాత్మగాంధీ నగర్‌లో జరిగిన పోటీలలో స్థానిక మహిళలు పెద్ద సంఖ్యలో పాలు పంచుకున్నారు. పోటీలులో గెలిచిన మహిళలకు ఫౌండేషన్ చైర్మన్ డిసిసి అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నేతలు చంద్రశేఖర్ డోలి రమేష్ అశోక్ రెడ్డి సిఎల్ యాదగిరి సంజీవ్ కుమార్ శివకుమార్ సంతోష్ రెడ్డి శేఖర్ సంతోష్ యాదవ్ నాగరాజ్ వీనస్ మేరి పద్మ హైమ విమల విజయ సుభాషిని ఇతరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరాలు పేదలకు వరాలు


రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

సికింద్రాబాద్, జనవరి 9 ప్రభాతవార్త : సకాలంలో రోగాలను గుర్తించలేకపోవడం వల్ల ఎంతోమంది ప్రాణాలను కాపాడుకోలేకపోతున్నారని తెలంగాణ రాష్ట్ర గంగపుత్ర సంఘం అధ్యక్షుడు దేశబోయిన రఘు అన్నారు. స్పందన సంస్థ ఆధ్వర్యంలో వారాసిగూడ గంగపుత్ర సొసైటి ఆవరణలో జరిగిన ఉచిత మెడికల్, దంత వైద్య శిబిరం కార్యాక్రమంలో ముఖ్యఅతిథి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ ఆస్పత్రులు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నప్పటికి ప్రజల అవసరాలను పూర్తిస్థాయిలో తీరడం లేదని అన్నారు. స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం వల్ల నిరుపేదలు కూడా వైద్య సేవలు పొందగలుగుతారని అన్నారు. ప్రైవేట్ ఆస్పత్రులు కూడా ముందుకు వచ్చి మురికి వాడలు, మధ్య తరగతి ప్రజలు నివసించే ప్రాంతాలలో ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ శిబిరంలో 3వందల మంది ఉచిత వైద్యసేవలు పొందారు.

## కెటిఆర్ చిత్రపటానికి పాలాభిషేకం


సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ చిత్రపటం వద్ద కార్పొరేటర్ హేమలత సురేష్‌రెడ్డి

జీడిమెట్ల,జనవరి9 ప్రభాతవార్త: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సుభాష్‌నగర్ డివిజన్ పరిధి ఫైపులైన్ రోడ్డులో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి రూ.56కోట్లతో స్టీలు బ్రిడ్జి నిర్మాణం ఏర్పాటుకు నిధులు మంజూరు చేసిన మంత్రి కేటీఆర్‌కు సోమవారంకార్పొరేటర్ హేమలత సురేష్‌రెడ్డి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ షాపూర్‌నగర్ మెదక్ రోడ్డు నుంచి నేషనల్ హైవేకు అనుసంధానం చేస్తూ రూ.56కోట్లతో సుమారు 3.8కిలోమీటర్ల మేర స్టీలు బ్రిడ్జి నిర్మాణాకి నిధులు మంజూరు చేసిన కేటీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ రహదారిలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా మాస్టర్ ప్లాన్‌లో భాగంగా ప్రస్తుతం ఉన్న 60ఫీట్ల రోడ్డును 80ఫీట్లకు పెంచి నాలుగు వరుసలతో స్టీలు బ్రిడ్జి నిర్మాణం చేపట్టనున్నామన్నారు. స్ట్రాటజిక్ రోడ్డు డెవలప్‌మెంట్ ప్లాన్ ఫేజ్2 కింద టెండరు ప్రక్రియ పూర్తయిన వెంటనే నిర్మాణ పనులు ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ప్రధాన కార్యదర్శి శివాజీ, టీఆర్ఎస్ నాయకులు మంగ, పద్మావతి, జహంగీర్, విజయ్‌కుమార్, నరేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, సత్యనారాయణ, రాము, స్థానికులు పాల్గొన్నారు.

## ఉచితంగా మధుమేహా వైద్యపరీక్షా శిబిరం

చిక్కడపల్లి, జనవరి 9 ప్రభాతవార్త: మధుమేహం వ్యాధిగ్రస్తులు వైద్యుల సలహాలు సూచనలు తప్పకుండా తీసుకోవాలని ప్రముఖ వైద్యులు డాక్టర్ ఎన్.వెంకటరమణరావు అన్నారు. సోమవారం చిక్కడపల్లిలోని డాక్టర్ వెంకటరమణ ఆసుపత్రిలో ఉచితంగా మధుమేహ వైద్యపరీక్షా శిబిరాన్ని నిర్వహించారు. పెద్దసంఖ్యలో ప్రజలు పరీక్షలను చేయించుకున్నారు. అనంతరం అవసరమైన వారికి ఆరోగ్య సూత్రాలు, సూచనలు ఇవ్వడంతో పాటు మధుమేహాన్ని ఏ విధంగా కట్టడి చేయాలి, మందులు ఏవి వాడాలి తదితర వివరాలను వెల్లడించారు. ఈ పరీక్షల నిర్వహణకు క్లీనిక్ ల్యాబ్‌ఇంచార్జ్ లక్ష్మణ్ సహకరించారు.

### అద్భుతంగా సాగిన తెలంగాణ ఫోక్ ఆర్ట్స్ అకాడమి నృత్యాంశాలు

చిక్కడపల్లి, జనవరి 9 ప్రభాతవార్త: తెలంగాణ ఫోక్ ఆర్ట్స్ అధినేత విక్కి మాస్టర్ ఆధ్వర్యంలో ఆదివారం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో ప్రముఖ నాట్యగురువు జ్యోతి కులకర్ణి నేతృత్వంలో శిష్యబృందం ప్రదర్శించిన నాట్యాంశాలు అందరిని మంత్రముగ్దులను చేశాయి. జాతీయ నృత్యోత్సవ్ కార్యక్రమంలో భాగంగా జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విశ్రాంత న్యాయమూర్తి బూర్గుల మధుసూదన్ హాజరై అద్భుతంగా నృత్య ప్రదర్శనలు నిర్వహించిన కళాకారులను, నర్తకులను సత్కరించి అభినందించారు.


శ్రీ ధర్మ శాస్త్ర సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం అడ్డగుట్టకు చెందిన 50 మంది అయ్యప్ప స్వాములు 41 రోజు దీక్ష చేసి సోమవారం అడ్డగుట్ట నుంచి అయ్యప్ప స్వాములు ఆటపాటలతో శబరి యాత్రకు తరలివెళ్లారు.

## విద్యతోనే విజయాలు సాధించగలం : మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్


ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాల భవన నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న మంత్రి తలసాని

ధర్నాచౌక్, జనవరి 9, ప్రభాతవార్త: విద్యతోనే విజయాలు సాధించగలమని, దేశాభివృద్ధికూడా విద్యపైనే ఆధారపడి ఉందని పశుసంవర్ధక శాఖా మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్ అన్నారు. సోమవారం ముషీరాబాద్ నియోజకవర్గంలోని ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాల నూతన భవన నిర్మాణ పనులు, కవాడిగూడ డివిజన్‌లోని బండమైసమ్మ నగర్‌లోని నూతన లైబ్రరీ భవన నిర్మాణ పనులు, రాంనగర్ డివిజన్‌లోని బాకారం పోచమ్మ దేవాలయం వద్ద గ్రంథాలయ భవన నిర్మాణ పనులను ఆయన స్థానిక ఎమ్మెల్యే ముఠాగోపాల్, నగర డిప్యూటి మేయర్ శ్రీలతారెడ్డిలతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మనబడి, మన బస్తీ కార్యక్రమంలో భాగంగా ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాల భవన పునర్నిర్మాణానికి నాలుగున్నర కోట్ల నిధులు విడుదల చేశారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను కార్పోరేట్ పాఠశాలలకు ధీటుగా తీర్చి దిద్దేందుకు తెలంగాణ ప్రభుత్వం చర్యలు చేపట్టిందని పేర్కొన్నారు. అందులో భాగంగా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 6,800 కోట్ల రూపాయలతో 9 వేల పాఠశాలలను ఆధునీకరించేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. అనంతరం ముఠా గోపాల్ మాట్లాడుతూ ముషీరాబాద్‌లో ప్రభుత్వ కళాశాల లేకపోవటం వల్ల విద్యార్థులు చదువును మధ్యలోనే నిలిపివేస్తున్నారని, ఈ విషయం ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లామని అన్నారు. ఈ కార్యక్రమాలలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఎమ్మెన్ శ్రీనివాసరావు, ఎడ్ల హరిబాబు యాదవ్, యువ నాయకులు ముఠా జైసింహ, వివిధ డివిజన్‌ల అధ్యక్షులు నర్సింగ్ ప్రసాద్, వల్లాల శ్యాం యాదవ్, రాకేష్ కుమార్, నాయకులు బింగినవీన్, శివముదిరాజ్, దీన్‌దయాళ్‌రెడ్డి, డిప్యూటి ఈవో చిరంజీవి, గ్రంథాలయ చైర్‌పర్సన్ ప్రసన్న రామ్మూర్తి, కార్యదర్శి పి.పద్మజ, గ్రంథాలయ ఉద్యోగుల సంఘం నేతలు అయోధ్య బొల్లం మహేందర్, అవినాష్‌రావు, సుకేష్ పాల్గొన్నారు.

## కంటివెలుగు కార్యక్రమం విజయవంతంగా నిర్వహించాలి

### దుండిగల్ మున్సిపల్ చైర్‌పర్సన్ క్రిష్ణవేణిక్రిష్ణ


సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ క్రిష్ణవేణిక్రిష్ణ

దుండిగల్, జనవరి 9 ప్రభాతవార్త : ఈనెల 18 నుండి వందరోజుల పాటు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టనున్న రెండోవిడుత కంటి వెలుగు కార్యక్రమానికి మున్సిపల్ పరిధిలో విజయవంతంగా నిర్వహించాలని చైర్‌పర్సన్ క్రిష్ణవేణిక్రిష్ణ అన్నారు. ఈమేరకు సోమవారం మున్సిపల్ సమావేశ మందిరంలో ఉన్నత అధికారులు, కౌన్సిలర్‌లతో కలిసి ఆమె సమీక్షసమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఒక్కరు కంటి సమస్యలతో బాధపడవద్దు అనే సదుద్దేశ్యంతో సిఎం కెసిఆర్ మహోన్నతమైన కంటి వెలుగు పథకానికి శ్రీకారం చుట్టారన్నారు. తొలివిడుతలో సుమారు ఎనిమిది నెలల పాటు రాష్ట్ర వ్యాప్తంగా 1.54కోట్ల మందికి స్క్రీనింగ్ చేసి సుమారు 54లక్షల మందికి కళ్ళఅద్దాలు అందజేయడం జరిగిందన్నారు. ఇది ప్రపంచంలోనే అతిపెద్ద ఐ స్క్రీనింగ్ కార్యక్రమంగా నిలిచిందని, పేదల ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తూ దేశానికే ఆదర్శంగా నిలుస్తున్న ఏకైక ప్రభుత్వం కెసిఆర్ ప్రభుత్వం అన్నారు. రెండో విడుత కార్యక్రమాన్ని సైతం మున్సిపల్ పరిధిలో విజయవంతంగా నిర్వహించేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. అందుకు తగిన ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో కమీషనర్ భోగీశ్వర్లు, వైస్‌చైర్మన్ పద్మారావు, పిహెచ్‌సి ఇన్‌చార్జి బాలరాజు, ఏఈ ప్రవీణ్, కౌన్సిలర్లు శంభీపూర్ క్రిష్ణ, శంకర్‌నాయక్, మహేందర్‌యాదవ్, భరత్‌కుమార్, గోపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సాయియాదవ్, నాయకులు బెంబడి బుచ్చిరెడ్డి, సుధార్‌రెడ్డి, మురళియాదవ్, విష్ణువర్ధన్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## మానవుడు ఆచరించాల్సిన ధర్మాన్ని గురించి చెప్పే వేద సారంశమే భగవద్గీత

### వ్యాసాశ్రమ పీఠాధిపతులు జగత్‌గురువు పరిపూర్ణానందగిరి స్వామి


కార్యక్రమంలో పాల్గొన్న వ్యాసాశ్రమ పీఠాధిపతులు జగత్‌గురువు పరిపూర్ణానందగిరి స్వామి

చిక్కడపల్లి, జనవరి 9 ప్రభాతవార్త: మానవుడు ఆచరించాల్సిన ధర్మాన్ని గురించి చెప్పే వేద సారంశమే భగవద్గీత అని వ్యాసాశ్రమ పీఠాధిపతులు జగత్‌గురువు పరిపూర్ణానందగిరి స్వామి అన్నారు. సోమవారం గాంధీనగర్‌లోని మలయాళస్వామి మఠంలో జరిగిన కార్యక్రమంలో భక్తులకు అనుగ్రహాభాషణం చేశారు. భగవద్గీత ఒకమతానికి సంబంధించినది కాదని, మానవాళి నుంచి మంచి భవిష్యత్తు నిర్మాణానికి మన పిల్లలందరికీ భగవద్గీతను నేర్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యాసాశ్రమ పీఠాధిపతులు అసంగానందగిరి స్వామి, కమలేష్ మహారాజ్, ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి, మఠం అధ్యక్షుడు బి.కృష్ణప్రసాద్, ప్రధాన కార్యదర్శి సరాబు లక్ష్మణ్ గుప్త, కోశాధికారి ఎన్.హరికిషన్, కాశెట్టి పాండుగుప్త, అల్లాడి నాగభూషణం గుప్త, యాద అశోక్ గుప్త, గోరేటి ఆనంద్‌గుప్త, నగేశ్ రాజు, దయాకర్ టిపిసిసి చార్మినార్ నియోజకవర్గం ఇంచార్జ్ కె.వెంకటేష్ పాల్గొన్నారు.

## పండగలు మన సాంప్రదాయాలను భావితరాలకు అందిస్తాయి : ప్రకాశ్‌గౌడ్


మణికొండలో బిఆర్ఎస్ ఆధ్వర్యంలో జరిగిన సంక్రాంతి ముగ్గుల పోటీలను తిలకిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

నార్సింగి, జనవరి 9 ప్రభాతవార్త : పండగలు మన సంస్కృతి, సాంప్రదాయాలను భావి తరాలకు అందిస్తాయని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ పేర్కొన్నారు. సోమవారం మణికొండ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కొండకళ్ల రామకృష్ణారెడ్డి, బిఆరెస్ మహిళా అధ్యక్షురాలు రూపారెడ్డిల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన "సంక్రాంతి ముగ్గుల" పోటీలు ఆసక్తిగకరంగా జరిగాయి. రోడ్లన్నీ అందమైన రంగ వల్లులతో నిండిపోయాయి. మహిళలు ఆసక్తిగా ఈ ముగ్గుల పోటీలలో పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. ఈ ముగ్గులను ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ పరిశీలించి మహిళలను అభినందించారు. ఉత్తమ ముగ్గులు వేసిన వారికి బహుమతులు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోనాలు, సంక్రాంతి సంబురాలలో ఆడపడుచుల హడావుడి ఎంతో సందడిగా కనిపిస్తుంటుందన్నారు. అందంగా తయారు చేసిన బోనాలు తలపై పెట్టుకొని అమ్మవార్లకు ముడుపులు చెల్లించే సమయంలో, ఇళ్ల ముందు రంగు రంగులతో ముగ్గులు వేయడంలో ఆడపడుచులు ఎంతో ఆసక్తి కనబరుస్తారన్నారు. మన సంస్కృతిని ప్రతిబింబించేలా, సంక్రాంతి పండగ వెనుకాల ఉన్న ఆంతర్యంను కళ్లకు కట్టినట్లు మహిళలు ముగ్గులు వేశారని తెలిపారు. ఈ ముగ్గుల పోటీలలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు, యువతులు పెద్ద ఎత్తున పాల్గొనడం శుభ పరిణామమన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మణికొండ మున్సిపల్ అధ్యక్షులు బుద్దోలు శ్రీరాములు, నాయకులు ఏర్పుల కుమార్ పాల్గొన్నారు.

## డా.వి.కె బావ మరణం చరిత్రకారులకు తీరని లోటు

### ఫోరం ఫర్ ఏ బెటర్ హైదరాబాద్ చైర్మన్ వేదకుమార్

హైదరాబాద్, జనవరి 9,ప్రభాతవార్త: ఐఏఎస్ అధికారి డా.వి.కె బావ మరణం హైదరాబాద్ చరిత్రకారులకు తీరనిలోటు అని ఫోరం ఫర్ ఏబెటర్ హైదరాబాద్ చైర్మన్ మణికొండ వేదకుమార్ అన్నారు. వి.కె.బావ మృతిపట్ల ఒప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. వి.కె.బావ హుడా మొదటి చైర్మన్, రాష్ట్ర అర్కైవ్స్ డైరెక్టర్ హైదరాబాద్ శాఖలకు సేవలిందించారని అలాగే హైదరాబాద్ చరిత్ర , వారసత్వ సంబంధిత విషయాల్లో చాలా మంది హెరిటేజ్ రీసెర్చ్ స్కాలర్‌లను వారి పరిశోధనలకు అతను సూచనలు అందించారన్నారు. ఫోరమ్ ఫర్ ఎ బెటర్ హైదరాబాద్ వ్యవస్థాపక కార్యనిర్వాహాక సభ్యుడిగా అతను హెరిటేజ్ సెల్‌ను ఏర్పాటు చేసి మొదటి కన్వీనర్‌గా బాధ్యతలు చేపట్టారని అలాగే హైదరాబాద్ వారసత్వ సంపదను, జనలవనరులను పరిరక్షించడంలో కీలక పాత్ర పోషించాడన్నారు. ఆయన ఫోరం కు అందించిన సేవలు ఎన్నటికీ మరవలేమని ఆయన మార్గదర్శకత్వం, ఉత్సాహం మాకు స్ఫూర్తినిస్తూనే ఉన్నాయన్నారు.

## మోండా డివిజన్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తా : కొంతం దీపిక


మనోహర్ థియేటర్ సమీపంలో ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న కార్పోరేటర్ కొంతం దీపిక తదితరులు

కంటోన్మెంట్,డిసెంబర్ 9 ప్రభాతవార్త: మోండా డివిజన్‌లోని వివిధ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని మోండా డివిజన్ కార్పోరేటర్ కొంతం దీపిక వివిధ శాఖల అధికారులకు సూచించారు. సోమవారం సెయింట్ ప్రాన్సిస్ స్కూల్ మనోహర్ థియేటర్ ప్రాంతాల్లో పర్యటించి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ రవిందర్,ఫీల్డ్ ఆఫీసర్ నరేందర్, ఎంఐటి.టీమ్ ప్రతినిధులు సదానంద్, యాదగిరి, నరేందర్, వినేయ్ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడా మైదానాన్ని మెరుగుపర్చినందుకు

### జంపనప్రతాప్‌ను అభినందించిన ప్రభుత్వ పాఠశాల హెచ్ఎం

కంటోన్మెంట్, డిసెంబర్ 9 ప్రభాతవార్త: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అనుగుణంగా తరగతి గదులు,క్రీడా మైదానాలను ఏర్పాటు చేసేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు వస్తే విద్యార్థులు చదువుతో పాటు క్రీడా రంగాల్లో మరింత అభివృద్ధి చెందుతారని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ తెలిపారు. 3వ వార్డు కారా ఖనలోని ప్రభుత్వ బాలికల పాఠశాల ప్రాంగణంలో రాళ్లు,రప్పలతో నిండి ఉన్న క్రీడా మైదానాన్ని చదును చేయాలని హెచ్ఎం మంజూల జంపన దృష్టికి తెచ్చారు. వెంటనే ఆయన స్పందించి కంటోన్మెంట్ బోర్డు అధికారి మహేందర్, దఫేదార్ రాజేశ్‌ల దృష్టికి తెచ్చారు. ఆయన కోర్కె మేరకు క్రీడా మైదానాన్ని చదును చేసి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. దీంతో సోమవారం పాఠశాల యాజమాన్యం జంపనప్రతాప్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్‌మాస్టర్ మంజూల, మట్‌పోర్ట్ హెచ్.ఎం. ఆశీర్వాదం, ఉపాధ్యాయులు షెడ్రక్, సురేందర్ రెడ్డి, ప్రసాద్, పద్మా, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

## ఓబిసి కమిటీల బలోపేతంపై చర్చ


రాష్ట్ర అధ్యక్షులు ఆలే భాస్కర్‌రాజ్‌తో నర్సాగౌడ్ తదితరులు

హైదరాబాద్, జనవరి 9,ప్రభాతవార్త: ఓబిసి మోర్చా రాష్ట్ర అధ్యక్షులు ఆలె భాస్కర్‌రాజ్‌ను రాష్ట్ర అధికార ప్రతినిధి నర్సాగౌడ్ సోమవారం మర్యాదపూర్వకగా కలిశారు. ఈసందర్భంగా ఓబిసి కమిటీల బలోపేతంపై చర్చించారు. ఈసందర్భంగా ఆలే భాస్కర్ మాట్లాడుతూ నిర్మల్ జిల్లా బిజెపి అధ్యక్షురాలు డాక్టర్ పడకంటి రమాదేవి సూచనలతో నిర్మల్ జిల్లా ఓబిసి మండల కమిటీల నిర్మాణం, జిల్లా కమిటీల నిర్మాణం పై చర్చించాలన తెలిపినట్లు నర్సాగౌడ్ పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ఓబిసి గీతాసెల్ రాష్ట్ర కో కన్వీనర్ రాగులు కిరణ్‌కుమార్‌గౌడ్, మోత్కూరు సంజీవ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చార్మినార్, జనవరి 9 ప్రభాతవార్త : విద్యుత్ మరమ్మతులు కారణంగా షంషేర్‌గంజ్,హుడాకాలనీ ఫీడర్ల పరిధులలో ఈ నెల 10వ తేదీ మంగళవారం ఉదయం 10 నుంచి 12 గంటలు వరకు, హుడాకాలనీ,సత్తర్ బాగ్ ఫీడర్ల పరిధులలో 12 నుంచి 2 గంటలు వరకు విద్యుత్ సరసఫరాను నిలిపి వేయనున్నట్లు సిబిడి అధికారులు తెలిపారు.కాగా ఈద్గా, పురానాపూల్, గాజి బండ, రూపులాల్ బజార్ ఫీడర్ల పరిధులలో మధ్యాహ్నం 3 నుంచి 5 గంటలు వరకు,మసారత్ నగర్ ఫీడర్ పరిధిలో 12 నుంచి 3 వరకు,అలి యాబాద్ ఫీడర్ పరిధి 3 నుంచి 5 గంటలు వరకు విద్యుత్ సరఫరా ఉండదని అధికారులు తెలియజేశారు.

## యాదవ సంఘం నూతన కమిటీ నియామకం


నూతన యాదవ సంఘం సభ్యులు

కెపిహెచ్‌బి కాలనీ, జనవరి 9, ప్రభాతవార్త : కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని ఆల్విన్‌కాలనీ డివిజన్ జయనగర్‌లో యాదవ, కురుమ సంఘం సభ్యుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో వివేకానందనగర్, కూకట్‌పల్లి, ఆల్విన్‌కాలనీ, హైదర్‌నగర్ డివిజన్‌లకు చెందిన యాదవులు పాల్గొని సోమవారం కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీలో గౌరవ అధ్యక్షులుగా దాసరి నర్సింగ్‌యాదవ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకోగ నూతన అధ్యక్షులుగా ఎక్కల్ దేవ్ శ్రీకాంత్‌యాదవ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శులుగా కాశినాథ్‌యాదవ్,కుమార్‌యాదవ్, కార్యదర్శులుగా నాగరాజుయాదవ్, శ్రీనివాస్ కురుమ, సలహాదారులుగా సత్యనారాయణయాదవ్, పర్వతాలు యాదవ్, త్రినాథ్‌యాదవ్, అంజన్‌యాదవ్, వేణుయాదవ్‌లను, ఉపాధ్యక్షులుగా వేణుయాదవ్, నిరంజన్ యాదవ్, బాలుయాదవ్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమపై నమ్మకంతో ఈ పదవులను ఇచ్చి ఎన్నుకున్నందుకు యాదవ సోదరులకు పెద్దలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీరప్ప యాదవ్, మల్లీ యాదవ్, రాజు యాదవ్, శ్రీనివాస్‌యాదవ్, శ్రీశైలం యాదవ్, గంటి వేణుయాదవ్, అనిల్‌యాదవ్, రాముయాదవ్, శ్రీకాంత్‌యాదవ్, కె.వేణుయాదవ్, సన్యాసిరావు యాదవ్, అంజన్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## నేక్‌నామ్‌పూర్ చెరువు పరిసరాలను శుభ్రం చేసిన విద్యార్థులు


పర్యావరణ రహిత కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు

నిజాంపేట్, జనవరి 9 ప్రభాతవార్త: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి వీఎన్ఆర్ వీజేఐఈటీ విద్యార్థులు సోమవారం మణికొండ సమీపంలోని నేక్‌నామ్‌పూర్ చెరువు పరిసరాలను శుభ్రం చేశారు. ఈ పర్యావరణరహిత కార్యక్రమం కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ యూనిట్ల ప్రోగ్రామ్ ఆఫీసర్లు ధృవాంశ్ సంస్థ సహకారంతో నిర్వహించగా బీ.టెక్ సిఎస్ఈ డేటా సైన్స్, సీఎస్ఈ సైబర్ సెక్యూరిటీ విభాగంలో ద్వితీయ సంవత్సరంచదువుతున్న 120 మంది విద్యార్థులు పాల్గొన్నారు. సామాజిక స్పృహతో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనగా వారికి డా. మధులిక చౌదరీ చెరువుల విశిష్ఠత, చారిత్రాత్మకతను వివరించి ఇటువంటి చెరువులను పరిరక్షించుకోవడం మనందరి కర్తవ్యమన్నారు. కొన్నేళ్ళుగా కాలుష్యానికి మారుపేరుగా నిలిచిన ఇబ్రహీం చెరువును, పరిసరాలను ధృవాంశ్ సంస్థ ద్వారా మేనేజింగ్ ట్రస్టీ డా.మధులిక చౌదరీ ప్రభుత్వ సహకారంతో పునరుద్ధరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు డా.మాధవి, డా.మన్మథనాథ్‌దాస్, డా.సునంద, డా.నేహా, డా.విజయరాఘవన్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డా.అశోక్‌భోగి, విద్యార్థులు పాల్గొన్నారు.

## మత మార్పిడికి పాల్పడుతున్న మల్లికార్జున్‌ను సస్పెండ్ చేయాలి: విహెచ్‌పి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న విహెచ్‌పి కార్యదర్శి పండరినాథ్, పి.బాలస్వామి,జగదీశ్వర్

గోషామహల్, జనవరి 9 ప్రభాతవార్త: నాస్తికత్వం పేరుతో హిందూ వ్యతిరేక చర్యలకు,మత మార్పిడికి పాల్పడుతున్న మల్లికార్జున్‌ను సస్పెండ్ చేయాలని, రేంజర్ల రాజేష్‌ను అరెస్ట్ చేయాలని తెలంగాణ విశ్వహిందు పరిషత్ కార్యదర్శి పండరినాథ్,జగదీశ్వర్,పగడాల బాలస్వామిలు తెలంగాణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం కోఠిలోని విశ్వహింద్‌పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ బి.ఆర్.అంబేద్కర్ పేరును అడ్డంపెట్టుకుని కొందరు హిందుమతాలపై,దేవుళ్లపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నట్లు వారు ఆరోపించారు.అన్ని మతాలను గౌరవించాలిన చెప్పిన గొప్ప నాయకుడు అంబేద్కర్ అన్నారు.హిందు ద్రోహులకు మద్దతిస్తూ భజరంగ్‌దళ్ కార్యకర్తలను పోలీస్ స్టేషన్‌లోనే చిత్ర హింసలు పెట్టిన మానుకోట ఎస్పీ,డిఎస్పీ,సిఐ,ఎస్ఐలను వెంటనే చట్టపరంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.రేంజర్ల రాజేష్‌ను ఇప్పటి వరకు అరెస్ట్ చేయకపోవడం సిగ్గు చేటు అన్నారు.లేని పక్షంలో ప్రభుత్వం మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. కల్వకుర్తిలో మతమార్పిడి మాఫియాకు ప్రభుత్వం మద్దతు తెలుపుతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా హిందువులపై అక్రమ కేసులు నమోదు చేస్తున్న పోలీసులపై న్యాయపోరాటం చేస్తామన్నారు.ఈ సమావేశంలో విశ్వహిందు పరిషత్ నాయకులు రాజేశ్వరరెడ్డి,రేగుఅనిల్,భరత్‌వంశీ,రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కొవిడ్ తర్వాత పిల్లల్లో మానసిక ఆరోగ్య సమస్యలు

### పద్మశ్రీ అవార్డు గ్రహీత ప్రొఫెసర్ శాంతా సిన్హా



ప్రెస్‌క్లబ్‌లో మాట్లడుతున్న శాంతాసిన్హా. చిత్రంలో జయలక్ష్మీ, అమూల్య తదితరులు

హైదరాబాద్, జనవరి 9,ప్రభాతవార్త: కొవిడ్ తర్వాత పిల్లల్లో మానసిక ఆరోగ్య సమస్యలు పెరిగాయని పద్మశ్రీ అవార్డు గ్రహీత ప్రొఫెసర్ శాంతా సిన్హా అన్నారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో హైదరాబాద్ సిటీ చిల్డ్రన్ పార్లమెంట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. బస్తీలో యువత మాదక ద్రవ్యాలు, మద్యం, తదితర వాటికి అలవాటు పడుతున్నారని వాటిని అరికట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. వివిధ స్థాయిల్లో కోరికలు,ఆలోచనలను ప్రభుత్వం నెరవేర్చాలన్నారు. కాగా నగరంలోని 30 బస్తీలకు చెందిన పిల్లలు హైదరాబాద్ సిటీ చిల్డ్రన్ పార్లమెంట్‌ను ఏర్పాటు చేసుకున్నారు. గతనెల ఉప్పల్‌లోని మోంట్ ఫోర్ట్ సోషల్ ఇనిస్టిట్యూట్‌లో హైదరాబాద్ సిటీ చిల్డ్రన్స్ పార్లమెంట్ శీతాకాల సమావేశాలు నిర్వహించారు. ఇందులో వివిధ అంశాలను చర్చించి పలు తీర్మాణాలు చేశారు. వాటిని వరల్డ్ చిల్డ్రన్స్ పార్లమెంట్ ప్రధాన మంత్రి ఏ.జయలక్ష్మీ, హైదరాబాద్ సిటీ చిల్డ్రన్ పార్లమెంట్ ప్రధాన మంత్రి అమూల్యలు ప్రెస్‌క్లబ్ సమావేశాల తీర్మాణాలు వివరించారు. ఈకార్యక్రమంలో ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ వర్గీస్ తేకనాథ్, జి.విక్రంకుమార్, వైశాలి, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

## డివిజన్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా: కార్పొరేటర్


డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న కొలన్ వీరేందర్‌రెడ్డి

నిజాంపేట్, జనవరి 9 ప్రభాతవార్త: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి 18వ డివిజన్ సాయిఅనురాగ్ కాలనీలో అభివృద్ధి పనులను సోమవారం కార్పొరేటర్ కొలన్ వీరేందర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్‌లోని ప్రతి కాలనీని అభివృద్ధి పరచడమే లక్ష్యంగా పని చేస్తానని, డివిజన్‌లోని సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరించి ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానన్నారు. కాలనీలో మంజూరైన భూగర్భ డ్రైనేజీ పనులను త్వరగా పూర్తి చేసి స్థానికులకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సాయి అనురాగ్ కాలనీ ఉపాధ్యక్షుడు సాయికృష్ణ, కార్యదర్శి భాష, కావ్య అవెన్యూ అధ్యక్షుడు విజయ్, కాలనీవాసులు పాల్గొన్నారు.

## వస్త్ర వ్యాపారులు మరింత అభివృద్ధి సాధించాలి



కార్యక్రమంలో పాల్గొన్న అసోసియేషన్ ప్రతినిధులు

చార్మినార్, జనవరి 9 ప్రభాతవార్త : వస్త్ర వ్యాపారులు మరింత అభివృద్ధి సాధించవలసిన అవసరం ఎంతైనా ఉందని ది హైదరాబాద్ హోల్‌సేల్ ఆర్ట్ సిల్క్ క్లాథ్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు గోవింద్ అగర్వాల్,ప్రధాన కార్యదర్శి పురుషోత్తం గుప్తాలు అన్నారు.ఆదివారం రాత్రి జరిగిన ది హైదరాబాద్ హోల్‌సేల్ ఆర్ట్ సిల్క్ క్లాథ్ మర్చంట్స్ అసోసియేషన్ 50వ వార్షికోత్సవంలో వారు పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వస్త్రాల వ్యాపారులు పురోగతిని సాధించవలసిన అవసరం ఉందని తెలిపారు.పలువురు వ్యాపారులను ఈ సందర్భంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు కపూర్ చంద్ గుప్తా,సంయుక్త కార్యదర్శి అశోక్ కుమార్ గుప్తా,కోశాధికారి సవార్‌మాల్, దాల్‌మాయితో పాటు రికాబ్‌గంజ్‌లోని ది హైదరాబాద్ హోల్‌సేల్ ఆర్ట్ సిల్క్ క్లాథ్ మర్చంట్స్ అసోసియేషన్‌కు చెందిన బట్టల వ్యాపారులు పాల్గొన్నారు.

## ఆటల పోటీల ముగింపు వేడుకల్లో పాల్గొన్న మంత్రి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

సంజీవరెడ్డి నగర్, జనవరి 9, ప్రభాతవార్త : సద్‌సంగత్, ప్రభందక్ కమిటీ గురుద్వారా సాహెబ్ అమీర్‌పేట్ వారు నిర్వహించిన బైశాఖీ క్రికెట్ టోర్నమెంట్‌తో పాటు ఇతర ఆటల పోటీల ముగింపు వేడుకలు సోమవారం అమీర్‌పేట్ జిహెచ్‌ఎంసి గ్రౌండ్‌లో జరిగాయి. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ విచ్చేసి కమిటీ సభ్యులను అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఇలాగే ఆటల పోటీలు, క్రికెట్ టోర్నమెంట్‌లు పెద్ద ఎత్తున జరగాలని ఈ రకంగా కుటుంబ సభ్యులు పాల్గొంటే ఎంతో ఆహ్లాదకరంగా ఉంటుందని అన్నారు. కమిటీవారు యువతకి క్రికెట్ టోర్నమెంట్, మహిళల కోసం మ్యూజికల్ చైర్, లెమన్‌స్పూన్ ఆటలు నిర్వహించారు. నిర్వహకులకు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తన తరపున లక్ష రూపాయలు బహుమానంతో పాటుగా రెండు క్రికెట్ కిట్స్ అందించారు. ఈ కార్యక్రమంలో అమీర్‌పేట మాజీ కార్పోరేటర్ శేషుకుమారి, సురేందర్‌రాజు సింఘ్, అనంజిత్‌కౌర్, సుమిత్‌సింగ్, జోగిందర్‌సింగ్, నిర్వాహకులు బలే ందర్‌సింగ్, మౌంటీసింగ్, సత్బిర్‌సింగ్, ఇంద్రపాల్‌సింగ్, గురుద్వారా అధ్యక్షులు భాగిందర్‌సింగ్, కార్యదర్శి సురేందర్‌సింగ్, బి.ఆర్.ఎస్.సీనియర్ నాయకులు అశోక్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## విధులు బహిష్కరించిన న్యాయవాదులు



విధులు బహిష్కరించి నిరసనలు తెలుపుతున్న న్యాయవాదులు

నాంపల్లి, జనవరి 9 ప్రభాతవార్త : నిజామాబాద్ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గణపతిపై నిజామాబాద్ జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అక్రమ కేసును బనాయించి బుక్ చేయించినందుకు నిరసనగా ఈరోజు సోమవారం నాంపల్లి క్రిమినల్ కోర్ట్ ఆధ్వర్యంలో న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జస్పాల్ సింగ్, ఉపాధ్యక్షుడు రామ్‌చరణ్, లైబ్రేరియన్ పద్మావతి, జాయింట్ సెక్రటరీ అవినాష్, సభ్యులు న్యాయవాదులు తిరుపతి వర్మ, జక్కుల లక్ష్మణ్, వెంకట్ యాదవ్, వినయ్‌పాల్ సింగ్, ఖాదీర్, రఘు, అసద్, రమేష్, నరేష్, ఉమ తదితరులు పాల్గొన్నారు.

## కంటి వెలుగును విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్

చార్మినార్, జనవరి 9 ప్రభాతవార్త : ప్రజలకు కంటి సమస్యలను దూరం చేసే లక్ష్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి కేసిఆర్ జనవరి నెల 18 నుంచి ప్రారంభిస్తున్న రెండవ దఫా కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాజేంద్రనగర్ అసెంబ్లీ నియోజకవర్గం ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ అన్నారు. రాజేంద్రనగర్ జిహెచ్‌ఎంసి సర్కిల్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రెండవ దఫా కంటి వెలుగు కార్యక్రమంలో అందరూ ప్రజా ప్రతినిధుల భాగస్వామ్యంతో ముందుకు వెళ్లాలని తెలియజేశారు. అన్ని విభాగాలలోని అధికారులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో రాజే ంద్రనగర్ కార్పొరేటర్ అర్చన, డిసి జగన్, ప్రాజెక్ట్ అధికారి రాధారాణితో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

## నూతన వాటర్ పైప్‌లైన్ పనుల పరిశీలన



బండ్లగూడ జాగీర్‌లో నూతనంగా వేస్తున్న వాటర్ పైప్‌లైన్‌ను పరిశీలిస్తున్న మేయర్ మహేందర్‌గౌడ్

నార్సింగి, జనవరి 9 ప్రభాతవార్త : బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ పరిధిలోని ఐసిఐసిఐ బ్యాంక్ నుంచి పాత గ్రామ పంచాయతీయ వరకు వేస్తున్న వాటర్ పైప్‌లైన్ పనులను సోమవారం మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్ పరిశీలించారు. జల మండలి అధికారులతో కలిసి వాటర్ పైప్‌లైన్ పనులను పరిశీలించి, పలు ప్రాంతాలలో ఉన్న లొసుగులను సరి చేయాలని సూచించారు. సమైక్య లో జనవరి వచ్చిందంటే చాలు ప్రజలు నీటి కోసం బిందెలు పట్టుకొని, వాటర్ ట్యాంకర్‌ల చుట్టూ తిరిగే వారని గుర్తు చేశారు. భూగర్భ నీటి మట్టం పడిపోయి ఇళ్లలోని బోర్లు వట్టి పోయేవని, పంచాయతీ నీరు పదిహేను రోజులకో మారు వచ్చేదన్నారు. బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ ఏర్పడిన తరువాత తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించడంపై దృష్టి పెట్టామన్నారు. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ ప్రత్యేక చొరవ తీసుకొని జల మండలి అధికారులపై ఒత్తిడి తీసుకురావడంతో గత రెండేళ్ల కాలంగా నీటి ఇబ్బందులు 90.శాతం వరకు తగ్గాయన్నారు. కొత్తగా ఏర్పడుతున్న కాలనీలు, అపార్టుమెంట్లు, గేటెడ్ కమ్యూనిటీ ఇళ్లకు కొత్తగా పైప్‌లైన్‌లు వేసి వేగంగా నీటి ఇబ్బందులు తీరుస్తున్నామన్నారు. అభివృద్ధి పనుల్లో ఎక్కడా రాజీ పడడం లేదని, రాజకీయాలకు తావివ్వడం లేదని మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జల మండలి అధికారులు, స్థానికులు పాల్గొన్నారు.

### ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ వెయిట్ లిఫ్టింగ్‌లో ఛాంపియన్‌షిప్ సాధించిన హైదరాబాద్ జట్టు



వెయిట్ లిఫ్టింగ్‌లో విజేతగా నిలిచి షీల్డ్‌ను అందుకుంటున్న హైదరాబాద్ క్రీడాకారుడు

సైఫాబాద్, జనవరి 9 ప్రభాతవార్త: ఢిల్లీలో ఈ నెల 5వ తేదీ నుంచి 9వ తేదీ వరకు జరిగిన ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ వెయిట్ లిఫ్టింగ్ పవర్ లిఫ్టింగ్ మరియు బెస్ట్ ఫిజిక్ టోర్నమెంట్ 2022లో ఆర్ఎస్‌బి హైదరాబాద్ టీమ్ ఛాంపియన్‌షిప్ సాధించింది. ప్లస్ వంద కేజీల విభాగంలో ఎం.ఆర్.చైతన్య (ఇన్‌కాం ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్) బంగారు పతకం సాధించారు. ఇదే విభాగంలో రామ్మోహనరావు (డిఏపి) 4వ స్థానాన్ని సాధించారు. 89 కెజిల విభాగంలో జి.నాగరాజు కాంస్య పతకాన్ని సాధించగా, 67 కెజీల విభాగంలో మిహిర్ సోని బంగారు పతకం, వై.శివకుమార్ వెండి పతకాలు సాధించారు. మిగతా విభాగాల్లో క్రీడాకారులు లక్ష్మణ్‌నాయక్, నాగేశ్వర్‌రావు, లల్లూనాయక్, అన్వేష్, యల్లయ్య, సంతోష్, కవితారాణి, సుష్మ రాణించారు. పవర్ లిఫ్టింగ్ విభాగంలో మహేష్ కాంస్య పతకం సాధించారు. హైదరాబాద్ జట్టుకు కోచ్ లుగా జి.నాగరాజు, కె.రామ్మోహనరావు క్రీడాకారులను టీమ్ మేనేజర్స్‌ను ఎస్‌కె రంజాన్‌అలీ, కోటేశ్వరరావులు అభినందించారు.

## అయ్యప్ప స్వామి ఆశీస్సులతో అందరు బాగుండాలి : వడ్డేపల్లి రాజేశ్వరరావు



శబరికి బస్సు యాత్రను ప్రారంభిస్తున్న రాజేశ్వరరావు

కెపిహెచ్‌బి కాలనీ, జనవరి 9, ప్రభాతవార్త : శబరిగిరీసుడు హరిహర పుత్రుడు అయ్యప్ప స్వామి ఆశీస్సులతో అందరూ బాగుండాలని తిరుమల తిరుపతి దేవస్థానం ట్రస్ట్ బోర్డు అడ్వైజరీ కమిటీ సభ్యులు, బిజెపి నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలోని మూసాపేటలో గల గూడ్‌షెడ్ రోడ్డులో హరిహరసుత అయ్యప్ప భక్త బృందం శబరిమల యాత్ర బస్సును వడ్డేపల్లి రాజేశ్వరరావు జెండా ఊపి ప్రారంభించారు. మూర్తి గురుస్వామి ఆధ్వర్యంలో పలువురు అయ్యప్ప భక్తులు బస్సుయాత్ర ద్వారా శబరిమల వెళ్ళారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు దుర్యోధన, బీమావు, చిన్నికృష్ణ, వెంకట్రావు, తిరుపతి, సురేష్, నాగభూషణం, మహేష్, కగేష్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

## మహిళలకు చీరెల పంపిణీ



చీరెలను పంపిణీ చేస్తున్న ర్యాల మహేందర్ యాదవ్, రాజేందర్ యాదవ్

మెట్టుగూడ, జనవరి 9 ప్రభాతవార్త: మాజీ కార్పోరేటర్ ర్యాల అడవయ్య చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో వివిధ సేవా కార్యక్రమాలను చేపడుతున్నామని ట్రస్టు నిర్వాహకులు మహేందర్ యాదవ్, రాజేందర్ యాదవ్ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం మెట్టుగూడలో అడవయ్య వర్థంతి సందర్భంగా పేద మహిళలకు చీరెలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధులు బాలమణి, సురేఖ, నర్సింగ్, శ్రీనివాస్, మురళి తధితరులు పాల్గొన్నారు.

## గ్యార్మీ వేడుకలకు హాజరైన డిప్యూటీ స్పీకర్



గ్యార్మీ షరీఫ్ వేడుకల్లో పాల్గొన్న డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్, కార్పొరేటర్ రాసూరి సునిత

తార్నాక, జనవరి 9 ప్రభాతవార్త: సికింద్రాబాద్ నియోజకవర్గం వివిధ ప్రాంతాల్లో మైనార్టీ నాయకులు ఏర్పాటు చేసిన గ్యార్మీ వేడుకల్లో డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ పాల్గొన్నారు. విజయపురి కాలనీ సౌత్‌లాలాగూడ మజీద్ ప్రాంతంలో నిర్వహించిన గ్యార్మి షరీఫ్ సంప్రదాయ వేడుకల్లో ముస్లీం పెద్దలతో ఉత్సహంగా పద్మారావుగౌడ్, మెట్టుగూడ కార్పొరేటర్ సునిత తధితరులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు ఉమర్ రాజ, షారుఖ్, షాను, జాకిర్, బదు, అశీస్, జినెత్, జావెద్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

### కార్మిక వర్గ వ్యతిరేక విధానాలపై
## ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలి



డైరీని ఆవిష్కరిస్తున్న ఎస్.బాల్‌రాజ్, ఎం.డి.యూసఫ్

హైదరాబాద్, జనవరి 9 ప్రభాత వార్త: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలపై ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలని ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.డి.యూసఫ్, ఎస్.బాల్‌రాజ్ కార్మిక లోకానికి పిలుపునిచ్చారు. ఎఐటియసి తెలంగాణ రాష్ట్ర సమితి రూపొందించిన నూతన సంవత్సరం డైరీని సోమవారం సత్యనారాయణరెడ్డి భవన్‌లో ఆవిష్కరించిన సందర్భంగా వారు మాట్లాడారు. కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం కార్పోరేట్ పెట్టుబడిదారులకు అనుకూలంగా 29 కార్మిక చట్టాలను సవరిస్తూ 4 కోడ్‌లుగా మార్చిందని దీని మూలంగా కార్మిక వర్గంపై తీవ్ర నిర్భందాలను తీసుకువచ్చిందని తక్షణమే కోడ్‌లును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అసంఘటిత రంగంలో ఉన్న కోట్లాది మంది కార్మికులకు సామాజిక భద్రత అందరికి ఇఎస్ఐ, పిఎఫ్ సౌకర్యం కల్పిస్తున్నామని ప్రకటించినప్పటికి అమలు కాకపోగా 6 సంవత్సరాల నుంచి ఏలాంటి చర్యలు చేపట్టకపోకపోవడంతో వేలాది మంది కార్మికులు ఉపాధి కోల్పోయారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అసంఘటిత రంగంలో పనిచేస్తున్న 47 కోట్లమంది కార్మికులలో 5 కోట్లమందికి మాత్రమే ప్రభుత్వం పిఎఫ్ పొకర్యం కల్పిస్తున్నదని ఆదే విధంగా 4.84 కోట్లమందికి ఇఎస్ఐ సౌకర్యం కల్పిస్తున్నదని అందరికి వర్తించే విధంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎఐటియుసి నాయకులు వాసిరెడ్డి సీతారామయ్య, బి.చంద్రయ్య, ఉజ్జిని రత్నాకర్‌రావు, ఎం.నర్సింహ్మా, ఎస్.విలాస్, పల్లా దేవేందర్‌రెడ్డి, ఓరుగంటి యాదయ్య, ఎన్.కరుణకుమారి, బి.వెంకటేశం, ఇమ్రాన్, సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలల పూర్తి స్థాయిలో ఆధునీకరిస్తాం

మన బడి పనుల పురోగతిపై ఎమ్మెల్యే ఆరా



విద్యాశాఖాధికారులతో సమావేశమైన ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

హైదరాబాద్, జనవరి 9 ప్రభాతవార్త: పాఠశాలలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ చెప్పారు. మన బస్తీ-మన బడి పథకంలో భాగంగా అంబర్‌పేట నియోజవర్గంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలో చేపట్టిన అభివృద్ధి పనులపై సోమవారం నాడిక్కడ సమీక్షా సమావేశం జరిగింది. విద్యా శాఖ అధికారులు, ప్రాధానోపాధ్యాయులతో నిర్వహించిన ఈ సమావేశంలో పనులు పురోగతిని ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. తొలిదశలో ఎంపికైన 7 ప్రభుత్వం పాఠశాలలో పూర్తి సౌకర్యాలు కల్పించాలన్నారు. విద్యార్థులు కుర్చోవడానికి వీలుగా బెంచీలు, నూతన టాయిలెట్ల నిర్మాణం, భవనాలకు రంగులు వంటి వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే అనా న్నరు. ఇప్పటికే అన్ని సౌకర్యాలతో సిద్ధంగా ఉన్న రెండు పాఠశాలలను త్వరలోనే ప్రారంభించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి ఇఓ విజయలక్ష్మి, డిప్యూటి ఐఓఎస్ ఇక్బాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.



తెలంగాణ రాష్ట్రీయ బసవ్వ కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ బిఆర్ఎస్ నాయకులు, అధిత్యచారిట్రబుల్‌ట్రస్ట్ చైర్మన్ నందకిషోర్‌వ్యాస్(బిలాల్) ఆశీర్వచనాలు తీసుకుంటున్న దృశ్యం

## హాజారీ భవన్‌లో ఘనంగా పూజలు



శ్యామ్‌బాబా పూజలో పాల్గొన్న తెలంగాణ భజరంగ్ సేనా ఉపాధ్యక్షులు ఎన్.ఆర్.లక్ష్మన్‌రావుగుప్త

బేగంబజార్, జనవరి 9 ప్రభాతవార్త: గోషామహల్ హాజారీ భవన్‌లో జరిగిన శ్యామ్‌బాబా పూజ, కీర్తన కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్రభజరంగ్‌సేనా ఉపాధ్యక్షులు ఎన్.ఆర్.లక్ష్మన్‌రావుగుప్త పాల్గొన్ని ప్రత్యేక పూజలు చేశారు. భజరంగ్‌సేనా సిటి కార్యదర్శి సూర్య శుక్లా, జాంబాగ్ డివిజన్ బిజెపి అధ్యక్షులు అశ్వీన్, మహేష్, మహేందర్, తివారి, అశీష్ పాల్గొన్నారు.

## సీతా వక్కలంక, నిత్య కాశీభట్లచే భరతనాట్య ప్రదర్శన

చిక్కడపల్లి, జనవరి 9 ప్రభాతవార్త: వంశీ ఆర్ట్ థియేటర్స్, శుభోదయం గ్రూప్ సంయుక్త ఆధ్వర్యంలో వంశీ స్వర్ణోత్సవాల సందర్భంగా గురు సుజాత శ్రీనివాసన్ శిష్యులు సీతా వక్కలంక, నిత్య కాశీభట్లచే భరతనాట్య ప్రదర్శన చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో 12న నిర్వహించబోతున్నట్లు నిర్వాహక సంస్థ అధినేత, కళాబ్రహ్మ డాక్టర్ వంశీ రామరాజు వివరించారు. ఈ సందర్భంగా ఆరుగురు నాట్య గురువులైన పద్మశ్రీ డాక్టర్ బి.పద్మజారెడ్డి, కళారత్న ఓలేటి రంగమణి, కళారత్న ఎస్పీ.భారతతి, డాక్టర్ పి.రమాదేవి, డాక్టర్ వనజా ఉదయ్, సుజాత విజమూరిలకు 'వంశీ శుభోదయం గ్లోబల్ అవార్డు' లను బహుకరించబోతున్నామని, ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ ఓలేటి పార్వతీశం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి అమెరికా సప్నా వ్యవస్థాపకురాలు డాక్టర్ శరదాపూర్ణ శొంఠి పురస్కారాలను అందిస్తారని, కార్యక్రమంలో విశిష్ట అతిథులుగా డాక్టర్ లక్ష్మీప్రసాద్ కలపటపు కూడా పాల్గొంటారన్నారు.

## పార్కులకు ప్రహారీ గోడ నిర్మించాలి : బిజెపి నేతలు



జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న అడ్డగుట్ట బిజెపి నేతలు

అడ్డగుట్ట, డిసెంబర్ 9 ప్రభాతవార్త: అడ్డగుట్ట పెట్రోల్ బంక్ సమీపంలో ఉన్న పార్కు స్థలాలకు ప్రహారీ గోడ నిర్మించడంతో పాటు పారు ్కలను ఆధునీకరించాలని కోరుతూ సోమవారం జిహెచ్‌ఎంసి జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డికి అడ్డగు ట్ట డివిజన్‌కు చెందిన బిజెపి నేతలు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అడ్డగుట్ట డివిజన్ పరిసర ప్రాంతాల్లోని పార్కులు పూర్తిగా శిథిలావస్థకు చేరాయని, వాటికి ప్రహారీగోడలు లేక పోవడంతో కబ్జాలకు గురౌతున్నాయని జెడ్‌సి దృష్టికి తెచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి ఎస్సీమోర్చా అధికార ప్రతినిధి జి.హంసరాజ్, ఎగ్జిక్యూటీవ్ మెంబర్ విజయ్, అడ్డగుట్ట యువమోర్చా అధ్యక్షుడు గెల్లు ఉదయ్ యాదవ్, నాయకులు రాజశేఖర్, వెంకటస్వామి, లక్ష్మణ్ తదతరులు పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నాము

కార్పొరేటర్ తలారి చంద్రశేఖర్



బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్‌లో ఒకటో వార్డులో జరిగిన శానిటేషన్ డ్రైవ్‌లో పాల్గొన్న కార్పొరేటర్ తలారి చంద్రశేఖర్

నార్సింగి, జనవరి 9 ప్రభాతవార్త : బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ పరిధి ఒకటో వార్డులో పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నామని ఒకటో వార్డు కార్పొరేటర్ తలారి చంద్రశేఖర్ పేర్కొన్నారు. సోమవారం కార్పొరేషన్ లోని ఫీల్‌గుడ్ హోమ్స్, జెఎన్నారమ్, ఇంద్రానగర్ కాలనీ, తిరుమల హిల్స్, కెకె-4, వెంకటేశ్వర కాలనీ, విఘ్నేశ్వర కాలనీ, గణేష్‌నగర్, బృందావన్‌కాలనీ, విష్ణుపురి కాలనీ, విద్యానగర్, వాల్మీకి నగర్, శివసాయి, సుబ్రహ్మణ్య కాలనీలలో జరిగిన "శానిటేషన్ డ్రైవ్" కార్యక్రమంలో కార్పొరేటర్ పాల్గొని కార్మికులకు, సూపర్ వైజర్లకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్లు, ఇంటి పరిసరాలు, రోడ్లు అన్ని పరిశుభ్రంగా ఉంటేనే అంటు వ్యాధులను వ్యాపింపచేసే దోమలు, ఈగలు వృద్ధి అరికట్టబడుతుందన్నారు. ఇంటిని శుభ్రం చేసుకొని చెత్తను రోడ్లపై వేయకూడదని, ఇళ్ల ముందుకు వచ్చే ఆటోలలోనే వేయాలని సూచించారు. ప్రజల సహకారం ఉంటేనే ఏ కార్యక్రమమైనా విజయవంతం అవుతుందని, ప్రజలందరూ చెత్తను విధిగా ఆటోల్లో వేయాలని తెలిపారు. వీలైతే తడి, పొడి చెత్తను వేరు చేసి ఇవ్వడం మంచిదన్నారు. ఇళ్లల్లో తయారయ్యే చెత్త నుంచి ఎరువును తయారు చేసే విధానంను కూడా తెలిపేందుకు మా శానిటేషన్ సిబ్బంది సిద్ధంగా ఉందని, ఆసక్తి ఉన్న వారు వారిని సంప్రదించాలన్నారు.



లోయర్ ట్యాంకుబండులో భారత్ సేవాశ్రమం సంఘ్ ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న నగర బిజెపి అధ్యక్షుడు గౌతమ్ రావు, స్వామి మునిశ్వరానంద, స్వామి వెంకటేశ్వరనంద


తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ
GHMC

నిట్ నెం.51/EE-28/SBZ/GHMC/2022-23 పనిపేరు: నిర్వహణ పనులు, ఇతరములు-10, అంచనా విలువ (రూ.లక్షలలో): 247.10. బిడ్ సమర్పణకు ప్రారంభ తేది మరియు బిడ్ సమర్పణకు ముగింపు తేది మరియు సమయము : 10.01.2023న మ.3.30గం.లు. 17.01.2023న మ.3.30గంటలు. అధికారి పేరు మరియు చిరునామా, సెల్ నెం. ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు, 9154796465. తదుపరి వివరములను ఇ-ప్రొక్యూర్‌మెంట్ @http://www.tender.telangana.gov.in పై చూడవచ్చును.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు, డివిజన్ నెం. 28, GHMC.

DIPR.No.11150-PP/CL/Advt/1/2022-23 తేదీ: 09.01.2023


## సంక్షేమ రాజ్యానికి నిర్వచనం చెప్పిన మహనీయుడు ఎన్టీఆర్

టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు పి.సాయిబాబా



ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న టీడీపీ నేతలు

ధర్నాచౌక్, జనవరి 9, ప్రభాతవార్త: సంక్షేమ రాజ్యానికి నిర్వచనం చెప్పిన మహనీయుడు నందమూరి తారక రామారావని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు పి.సాయిబాబా కొనియాడారు. సోమవారం సరిగ్గా 39 సంవత్సరాల క్రితం జనవరి 9న కాంగ్రెస్ కబంధ హస్తాల నుండి తెలుగు రాష్ట్రాన్ని కాపాడిన ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశారని గుర్తు చేశారు. ఎన్టీఆర్ దేశంలోనే తొలిసారిగా రెండు రూపాయలకే కిలో బియ్యం, మద్యపాన నిషేధం, గ్రామాధికార వ్యవస్థ రద్దు, దున్నేవానిదే భూమి, సగం ధరకే విద్యుత్ చార్జీలు వంటి అనేక సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టి తెలంగాణకు నిజమైన స్వాతంత్రాన్ని అందచేసిన నాయకుడని కొనియాడారు. ఆనాటి అభివృద్ధి ఫలాలను, ఈరోజుకీ అనుభవిస్తున్న నాయకులు తెలంగాణ పేరు చెప్పుకుని, నీళ్లు, నిధులు, నియామకాల పేరుతో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు తెలంగాణకు ఏంచేశా రో ఆత్మ విమర్శ చేసుకోవాలని సూచిం చారు. ఈ కార్య క్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ నల్లెల్ల కిషోర్, ప్రధాన కార్యదర్శి పి.బాలరాజ్‌గౌడ్, రాష్ట్ర కార్యదర్శి నాగు నగేష్, పెద్దోజు రవీంద్రాచారి, కే.డి.దినేష్, సత్యనారాయణ, జోగిందర్‌సింగ్, వగ్గు బాలరాజ్ పాల్గొన్నారు.

## నీరా కేంద్రానికి 'వేదామృతం' పేరుపెట్టడాన్ని బ్రాహ్మణ సంఘాలు తీవ్ర అభ్యంతరం

చిక్కడపల్లి, జనవరి 9 ప్రభాతవార్త: రాష్ట్ర ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నీరా కేంద్రానికి 'వేదామృతం' పేరుపెట్టడాన్ని బ్రాహ్మణ సంఘాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశాయి. వేదా+అమృతం అనే అర్థం వచ్చేలా వేదాలను కింపరిచే విధంగా పేరు పెట్టడం హైందవ సమాజాన్ని కించపరిచే విధంగా కొంత మంది వ్యవహరిస్తున్న తీరుతో ఈ సమాజం కొంత అసహనానికి గురవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. వేదామృతం అనే పదాన్ని ఎక్కడ రానీయకుండా ప్రభుత్వమే జోక్యం చేసుకుని పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ ప్రభుత్వ సలహాదారు, తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ చైర్మన్ డాక్టర్ కె.వి.రమణాచారిని బ్రాహ్మణ సంఘం నేతలు చింతపలిన మంగపతిరావు, వక్కలంక శ్రీనివాస్, జేవీఎల్.నరసింహారావు, ప్రమోద్ కొఠార్, మంగు రాఘవరావు, గోగులపాటి కృష్ణమోహన్, బాచంపల్లి సంతోష్‌శర్మ, గిరిప్రసాద్ శర్మ, నాగేశ్వర్ సిద్ధాంతి తదితరులు కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు.


**PUBLIC NOTICE**

General public here by informed that my Client **Sri Bandari Kiran S/o Bandari Rajaiah,** resident of H.No. 1-145, Gudirev, Gurrevu, Adilabad, Telangana, 504206, has paid a consideration amount as token advance to SriJataram Vinod, S/o Jataram Govind, for purchase of open Plot No. 155 Southern Part in, Survey nos. 9,10,11,16,20,21(Part), situated at Venkaterswaranagar Colony, Chengicherla village, Boduppal Municipality, Medipally Mandal, Medchal-malkajgiri District, Admeasuring 100 Square Yards or 83.6 Square meters, and bounded by: North: Plot No.155 Northern Part, South: Plot No.154, East: 25' Wide Road, West: Plot No 172.

Who is its owner by virtue of registered sale deed bearing no 9280/2019, SRO Narapally, Medchal-malkajgiri District.

Therefore if any person or persons whosever do have any objection against the said sale deals shall contact the undersigned within Ten days of this publication with their supporting papers for their objections, failing which my client shall enter into a valid sale agreement and thereafter no claims or action will be considered and the deal shall be final".

**Sd/- Y BHARATH**
**ADVOCATE**
H.No 2-81/59/43, Dwaraka Nagar, Chengicherla Medipally, Medchal-malkajgiriDist 500098, **Ph No 9618214652**

**PUBLIC NOTICE**

The General Public is hereby informed that my clients **Sri N. Bhavani Sankar S/o. late N. Lakshmaiah and Smt.N.Nagamani W/o. N.Bhavani Sankar** both are R/o. H.No.2-2-72, Upperpally, Hyderguda, Hyderabad. Telangana State. has entered into sale agreement to purchase the open house Plot No.52 in Sy.No.2, 4, 5, 6, 7 & 8 admeasuring 350 Sq.yards situated at "Tirumala Garden" Bandlguda Jagir Village, Rajendernagar Mandal now it's called Bandlaguda Jagir Municipal Corporation, Gandipet Mandal, Ranga Reddy District, 500091 Telangana State, from **Sri. Sanam Shailendra Nath S/o. Sanam Narendra Nath,** Occ; Employee in Michigan State, USA, R/o. 24419 Willow brook Rd, Michigan State, USA and his local address is R/o. Plot No.13, Siri Enclave, Neaar Gnapraba School, Hyderaguda, Hyderabd, R'Nagar Municipality, R.R.Dist Telangana State. If any persons having any legal right, agreements, mortgagee or claim of any suits, title or objection over the said sale transaction or survey numbers shall approach the undersigned or to my clients with all original supporting documents with (7) days from the date of publication of this notice, failing which the sale transaction will be completed and no claims or objections of any kind thereafter will not be entertained in any manner.

**Sd/- K. Rajeswari, Advocate.**
O/c. 2-2-72, Upperpally, Hyderguda, Hyderabad-48.
**Cell No.8919913072, 9000519567.**

**IN THE COURT OF THE II ADDL. SENIOR CIVIL JUDGE:: RANGA REDDY DISTRICT: AT: L.B.NAGAR.**
**O.S.NO. 687 OF 2022**

BETWEEN:-
**Sri. DEVIREDDY PADMAJA AND ANOTHER. ...PLAINTIFFS.**
AND
**The Tahsildar Saroornagar Mandal AND OTHERS. ...DEFENDENTS.**

To
D1). Tahsildar Saroornagar Mandal, Saroornagar, Ranga Reddy Dist.
D2). Whom so ever it may concerned (All Concerned)

Please take notice that the Plaintiffs filed the above suit against Defendant No. 1 and All concerned for Declaration. The said suit O.S.No. 687 of 2022 stands posted on 27-01-2023 for appearance and W.S. of the Defendants. Therefore if anyone have objection they should be present in person or through Advocate on the aforesaid date at 10-30 A.M. at Hon'ble II Additional Senior Civil Judge court at L.B.Nagar. Otherwise, you will be set exparte on the said day, and the Suit will be decided on merits.

**SCHEDULE OF PROPERTY**

All that part and parcel of the land bearing Plot No. 438, in Survey No. 59 part, admeasuring 300 Sq. Yards or 250.83 Sq.Mtrs, situated at Ward No. 8, Block No.7, Teachers Colony, Kharmanghat Village, Saroornagar Mandal, Ranga Reddy Dist, under GHMC, within the limits of L.B.Nagar Circle and bounded as follows: North: 40 Feet Wide Road, South: Plot No. 455, East: Plot No.439, West: Plot No.437.

By Order of the Court.
**B.NAVEEN KUMAR, Advocate**
H.No.3-11-385, Shivaganga Colony, L.B. Nagar, Hyderabad - 74.
**Phone: 9440667509.**

**IN THE COURT OF THE HON'BLE PRINCIPAL DIST JUDGE: R.R. COURTS, AT: L.B.NAGAR.**
**O.P.No. 587 OF 2022**

BETWEEN:-
**Cheruku Ramgopal Goud,** S/o Cheruku Rangaiah Goud, Age: 42 Yrs, Occ: Business, R/o H.No.1-3, Near Majid Abdullapur Village & Mandal, R.R. Dist. ..Petitioner
AND
**All the Concerned ...Respondents**

**NOTICE**

That the above named petitioner is filed U/S29 of Hindu Minority and Guardianship act of 1956 to seeking permission from this Hon'ble Court to sell Minor's property of petitioners daughter namely Abhinaya Sree Goud D/o Cheruku Ramgopal Goud and subsequently that this Hon'ble Court was pleased to ordered for paper publication if any concerned person or persons claiming below said schedule property of Abhinaya Sree Goud D/o Cheruku Ramgopal Goud may present before above said Hon'ble Court on 23.01.2023 at 10.30 A.M. along with related documents or else, this Hon'ble court may take appropriate steps for further proceedings.

**PETITION SCHEDULE OF PROPERTY**

All that All that part of open land bearing Plot No.19 admeasuring 80 Sq.yds, in Survey Number 4/A situated at Abdullapur Village, Abdullapurmet Revenue Mandal (Previously Hayatnagar Mandal) R.R. District and Bounded by: North:25' Wide Road, South: Plot No.20, East: Plot No.3, West: Plot No.19 east part (middle place of the plot No.19).

(By Order of the Court)
**CH. V. MARUTHI KUMAR**
**Advocate**
H.No.5-100, Bhavaninagar, Dilsukhnagar, Hyderabad, **9849433406, 040-24040812**

**IN THE COURT OF HON'BLE II ADDL. SENIOR CIVIL JUDGE, R.R. DIST. AT: L.B.NAGAR.**
**O.S.No. 670 OF 2022**

Between:
**1. Thakur Madan Kishore Singh & Others ...Plaintiffs**
AND
**1. The Tahsildar,** Saroornagar Mandal, Ranga Reddy Dist.
**2. Union Bank of India,** Rep.by its Branch Manager, Meerpet Branch, Hyderabad.
**3. All Concerned. ...Defendants**

Please take Notice that the Plaintiffs herein have filed above suit for declaration to declare the Plaintiffs as legal heirs of deceased N.Chandrakala Thakur who died on 1.4.2017 the above suit is posted on 23.01.2023. If any one has any claim/objection in respect of claim made by the Plaintiffs, may appear before the Hon'ble Court at 10.30 A.M. by person or through an advocate failing which matter will be decided on merits.

**SCHEDULE OF PROPERTY-A:**

All that the Piece and Parcel of the House on Plot No.1 South Part, in Sy.No.133, 130, 112 and 113 Admeasuring 125 Sq.Yards or 104.51 Sq.Mtrs, Having Plinth Area 600 Sq.Feet of R.C.C. Block No.9 Siutated at Satya Sai Nagar of Jillelguda Village, Saroornagar Revenue Mandal, Ranga Reddy Dist., Bounded by: North: Plot No.1 Nort Part, South: Neighbours Land, East: Plot No.8, West: 25' Ft Wide Road.

**SCHEDULE OF PROPERTY-B:**

All that the Piece and Parcel of Land admeasuring 186.66 Sq.Yards, Equivalent to 156.07 Sq.Mtrs., Situated at Gramakantam, Badangpet Village, Saroornagar Revenue Mandal, Ranga Reddy Dist., Bounded by: North: Open Land Belongs to Yadagiri Reddy, South: Road, East: 60' wide Main Road to Nadergul, West: House belongs to Padma Chary.

//By the Order of Hon'ble Court//
**Sd/- G. PRAVEEN KUMAR**
**Advocate**
CSR Estate, Plot No.42, Huda Complex, Kothapet, **Cell No.9052096728**

# రూ.55లక్షల వ్యయంతో సిసి రోడ్డు పనులు : ఎమ్మెల్యే బేతి



పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బేతి, కార్పొరేటర్ చేతన

**ఉప్పల్, జనవరి 9 ప్రభాతవార్త :** హబ్సిగూడ డివిజన్ మహేశ్వరినగర్ కాలనీలో రూ.55 లక్షల వ్యయంతో చేపడుతున్న సిసి రోడ్డు పనులను సోమవారం స్థానిక ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, కార్పొరేటర్ కక్కిరేణి చేతన చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ హబ్సిగూడ డివిజన్ మహేశ్వరినగర్ కాలనీలో పెండింగ్‌లో ఉన్న పనులు దశలవారిగా చేపడుతున్నట్లు తెలిపారు. ప్రజలకు మౌళిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. డివిజన్ అభివృద్దే ధ్యేయంగా పనిచేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా కాలనీలో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డిఇ నాగమణి, ఎఇ సాయికిరణ్. బిజెపి నాయకులు సంజయ్‌పటేల్, సుమన్‌రావు, రంగ రవి, రవీందర్ రెడ్డి, ప్రవీణ్, బిఆర్ఎస్ నాయకులు గడ్డం రవికుమార్, గరిక సుధాకర్, డా.బి.వి.చారి, సోమిరెడ్డి, లక్ష్మినారాయణ, శివ, లింగానాయక్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

# పేద విద్యార్థులకు చేయూత అభినందనీయం : ఉప్పల



విద్యార్థులకు క్రీడా సామాగ్రి అందజేస్తున్న ఉప్పల శ్రీనివాస్‌గుప్త

**ఎల్.బి.నగర్, జనవరి 9 ప్రభాతవార్త:** నిరుపేద విద్యార్థులకు చేయూతను అందించడం అభినందనీయమని రాష్ట్ర పర్యాటక శాఖ అభివృద్ధి చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా పేర్కొన్నారు. కొత్తపేటలోని విక్టోరియా మెమోరియల్ రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థులకు సోమవారం శ్రేయోభిలాషి సేవా ట్రస్ట్ ఫౌండర్ చైర్మన్ విష్ణుజగతి ఆధ్వర్యంలో ఫుట్‌బాల్, వాలీబాల్, క్రికెట్ క్రీడాసామాగ్రిని ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉప్పల మాట్లాడుతూ నిరుపేదలకు స్వచ్ఛంద సంస్థలు అండగా నిలబడి వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలన్నారు. కార్యక్రమంలో సరూర్‌నగర్‌ఉపకమిషనర్ హరికృష్ణ, లయన్ డాక్టర్ బి.విజయరంగా, కళాశాల హెడ్ శివపార్వతి, రమేష్, జంగయ్యయాదవ్, కొత్తపేట బిఆర్ఎస్ మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ విజయగౌడ్ పాల్గొన్నారు.

# హబ్సిగూడ డివిజన్ కాంగ్రెస్ కమిటి కార్యవర్గం ఎన్నిక

**ఉప్పల్,జనవరి 9 ప్రభాతవార్త :** హబ్సిగూడడివిజన్ కాంగ్రెస్ కమిటి కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాలేరు జైనవీన్ ఆధ్వర్యంలో ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఏబ్లాక్ అధ్యక్షుడు మందముల్ల పరమేశ్వర్‌రెడ్డి, టిపిసిసి ప్రతినిధి తౌఫిక్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు పసుల ప్రభాకర్‌రెడ్డి, కంది ఆగిరెడ్డి,మర్రి రంజిత్‌రెడ్డి, గడ్డం లక్ష్మారెడ్డి, బిక్షపతి, కాలేరు సురేందర్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కంది శ్రవణ్‌రెడ్డి, ఉప్పల్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆకారపు అరుణ్‌కుమార్ సమక్షంలో కమిటిని ఏకగ్రీవంగా ఎన్నుకుంటూ తీర్మానించారు. డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షునిగా కాలేరు జైనవీన్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాలయ్యబాబు, ఉపాధ్యక్షులుగా గంగాధర్, టి.నరసింహ, కిషన్‌నాయక్, ప్రధాన కార్యదర్శిగా దర్మేంద్ర నాయక్, సంయుక్త కార్యదర్శిగా రామ్‌నాయక్, విశాల్, మల్లేష్, కార్యనిర్వాహక కార్యదర్శిగా శ్రీనివాసాచారి, శ్యామ్, శరత్‌నాయక్, కార్యదర్శిగా షబ్బీర్, సంపత్, యాదగిరి, అల్తాఫ్, వెంకటేష్‌గుప్తలను ఎన్నుకున్నారు. కొత్త కమిటి జాబితాను జిల్లా అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ అమోదానికి పంపించినట్లు వారు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అన్ని డివిజన్ కమిటిలు ఏకగ్రీవంగా ఎన్నుకుంటున్నామని పేర్కొన్నారు.

## ఈనెల 12వ తేదీన నేషనల్ స్పిరిట్ వాక్

**ఎల్.బి.నగర్, జనవరి 9 ప్రభాతవార్త:** స్వామి వివేకానంద 160వ జయంతి, 12వ తేదీన నేషనల్ యూత్‌డే సందర్భంగా ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించే నేషనల్ స్పిరిట్‌వాక్ 2023ను విజయవంతం చేయాలని గడ్డిఅన్నారండివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షుడు జక్కుల శ్రీశైలంయాదవ్ కోరారు. విక్టోరియా మెమోరియల్ హోమ్ వాకర్స్ అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరుతూ సోమవారం సరూర్‌నగర్ పట్టణంలోని వీఎం హోమ్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నర్సింగ్‌గౌడ్, ప్రధానకార్యదర్శి ఎన్.కబీర్ దాస్‌గౌడ్ ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో బబ్బురి ఆనంద్‌గౌడ్, బాలకిషన్, దుబ్బాక శశిధర్‌రెడ్డి, పార్శపు శ్రీధర్, కిరణ్, వెంకటేశ్వర్‌రెడ్డి, రామారావు, చంద్రారెడ్డి, సోమన్నగౌడ్, బుచ్చయ్యచౌదరి, సత్యనారాయణ, వేణుగౌడ్ పాల్గొన్నారు.

# బిజెపితో లౌకిక వాదానికి ముప్పు




ప్రసంగిస్తున్న ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్

**సైదాబాద్, జనవరి 9 ప్రభాతవార్త:** కేంద్రంలో మరోసారి బిజెపికి అధికారమిస్తే రాజ్యాంగ పీఠిక నుంచి లౌకిక, సామ్య వాదాన్ని తొలగించే ప్రమాదముందని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్ అన్నారు. చంపాపేటలోని లక్ష్మీ కన్వెన్షన్ హాల్‌లో రాష్ట్ర అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం ఆహ్వాన కమిటీ అధ్యక్షుడు కాచం సత్యనారాయణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సంఘ సభ్యుల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ భవిష్యత్ తరాలకు రాజ్యాంగ ఫలాలు దక్కాలంటే రాజ్యాంగ పరిరక్షణతో పాటు ప్రపంచ శాంతికి ప్రతిఒక్కరు నడుం బిగించాల్సి ఉందన్నారు. దేశంలో ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలపై మేధావులతో చర్చాగోష్ఠి జరగాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. సంఘ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ సుధాకర్ మాట్లాడుతూ ఫిబ్రవరి 11న నగరంలో జరిగే సంఘ 3వ మహా సభను విజయవంతం చేయడానికి పార్టీలకు అతీతంగా కృషి చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కెవిఎల్ నాగేశ్వరరావు, తిప్పర్తి యాదయ్య, పల్లె వినయ్ కుమార్, నర్సింగరావు, రఘుపాల్, కూర రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ పాలనలో సర్పంచ్‌లు సైతం ఆత్మహత్యలు చేసుకుంటున్నారు : చల్లా



ధర్నాలో మాట్లాడుతున్న డిసిసి అధ్యక్షుడు నర్సింహారెడ్డి

**సరూర్‌నగర్, జనవరి 9 ప్రభాతవార్త:** దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో బిఆర్ఎస్ పాలనలో సర్పంచ్‌లు సైతం ఆత్మహత్యలు చేసుకుంటున్నారని రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణలో పంచాయతీల నిధులు, సర్పంచ్‌ల సమస్యలపై టిపిసిసి ఆధ్వర్యంలో నగరంలోని ధర్నా చౌక్ వద్ద జరిగిన ఆందోళనకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో గ్రామ పంచాయతీలు, సర్పంచ్‌ల పరిస్థితి దారుణంగా తయారైందని అన్నారు. సర్పంచ్‌లకు, పంచాయతీ కార్మికులకు జీతాలు కూడా సక్రమంగా ఇవ్వడం లేదని ఆయన విచారం వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీలకు నిధులు ఇవ్వకపోగా సర్పంచ్‌లను మాత్రం ప్రభుత్వం ప్రతి పనికి బాధ్యులను చేస్తున్నదని ఆయన తెలిపారు. వచ్చే ఎన్నికల్లో బిఆర్ఎస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం తప్పదని ఆయన హెచ్చరించారు.

## మంత్రిని కలిసిన విద్యుత్ శాఖ అధికారులు



మంత్రికి శుభాకాంక్షలు తెలిపిన డిఇ సురేష్ తదితరులు

**మలక్‌పేట, జనవరి 9 ప్రభాతవార్త:** నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని చంపాపేట విద్యుత్‌శాఖ డిఇ సురేష్ అధికారులతో మంత్రి సబితాఇంద్రారెడ్డిని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసి నోటు పుస్తకాలు అందజేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులకు ఉత్తమ సేమ అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

# శ్రీ అభయాంజనేయస్వామి ఆలయానికి బిఎల్ఆర్ విరాళం

**ఉప్పల్, జనవరి 9 ప్రభాతవార్త :** ఉప్పల్ శ్రీ అభయాంజనేయస్వామి ఆలయం దేవాలయం ప్రహరిగోడ నిర్మాణానికి బిఆర్ఎస్ నేత బండారి లక్ష్మారెడ్డి రూ.లక్షన్నర విరాళం అందజేశారు. ఈ మేరకు సోమవారం ఆలయ కార్యనిర్వహణ అధికారి ఎల్.భాగ్యలక్ష్మి, మేనేజర్ శ్రీనివాసశర్మకు చెక్ అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ శ్రీ అభయాంజనేయస్వామి ఆలయ అభివృద్దికి తమ వంతు చేయూత అందిస్తున్నట్లు తెలిపారు. ఆలయం ప్రహరిగోడ నిర్మించేందుకు తన వంతు తోడ్పాటు అందిస్తామని తెలిపారు. బిఎల్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, మహేష్‌గౌడ్, శ్రీకాంత్‌గౌగౌడ్, కె.జగన్ తదితరులు పాల్గొన్నారు.

## ధర్నాకు తరలిన మేయర్ పారిజాత

**సరూర్‌నగర్, జనవరి 9 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలోని పంచాయతీలకు నిధులను తక్షణమే విడుదలచేయాలనీ అదే విధంగా సర్పంచ్‌ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ టిపిసిసి అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం నగరంలోని ఇందిరాపార్కు వద్ద జరిగిన ధర్నాకు బడంగ్‌పేట్ కార్పొరేషన్ మేయర్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి తరలివెళ్ళారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టిఆర్ఎస్ పాలనలో గ్రామ పంచాయతీలు నిర్వీర్యమవుతున్నాయనీ వాటికి రావాల్సిన నిధులను ప్రభుత్వం దారి మళ్ళించడం శోచనీయమన్నారు. సర్పంచ్‌లు సైతం సమస్యల్లో కొట్టుమిట్టాడుతున్నారని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీలు, సర్పంచ్‌లపై ప్రభుత్వతీరును కాంగ్రెస్ నిరసిస్తుందని తెలిపారు. ధర్నాలో పారిజాతతోపాటు కార్పొరేటర్ రాళ్ళగూడెం సంతోష శ్రీనివాస్‌రెడ్డి, అమృతానాయుడు, పెద్దబావి మౌనిక సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సభికులను మంత్ర ముగ్ధులను చేసిన 'కళార్చన'

**సైదాబాద్, జనవరి 9 ప్రభాతవార్త:** భారతీయ నృత్యాలు మన పౌరాణిక ఔన్నత్యాన్ని చాటిచెబుతాయని రామానుజ రావు అన్నారు. శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయ కమిటీ చైర్మన్ వై.ఎస్.ఆర్.మూర్తి సభాధ్యక్షతన గాయత్రి స్కూల్ ఆఫ్ డాన్స్ అండ్ మ్యూజిక్ అకాడమి, లక్ష్మినగర్ శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయ కమిటీల ఆధ్వర్యంలో సంయుక్తంగా నిర్వహించిన 'కళార్చన' కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. భరతనాట్యంలో సుజాత చక్రవర్తి, కూచిపూడి నృత్యంలో రావూరి గీతికల నృత్య ప్రదర్శనలు సభికులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా రామానుజ రావు మాట్లాడుతూ భారతీయ పౌరాణిక విశేషాలను పామరులకు కూడా అర్ధమయ్యే రీతిలో విశదీకరించి తెలియజేయడంలో భారతీయ నృత్యాలు అత్యుత్తమ పాత్రను పోషిస్తాయని అన్నారు. వైఎస్ఆర్ మూర్తి మాట్లాడుతూ భారతీయ నృత్యకళలు ప్రపంచంలోనే గొప్పవని అన్నారు. ఈ కార్యక్రమంలో గాయత్రి స్కూల్ ఆఫ్ డాన్స్ అండ్ మ్యూజిక్ అకాడమి అధినేత డాక్టర్ జ్యోతి శేఖర్, గాయని యడవల్లి కామేశ్వరి, గాయత్రి శేఖర్, సత్యప్రకాష్ యాదవ్, ఆలయ కమిటీ డైరెక్టర్ వేదుల కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.

# చప్పిడి అడివిరెడ్డి గార్డెన్స్‌లో రంగోలి పోటీలు

**సరూర్‌నగర్, జనవరి 9 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని చప్పిడి అడవిరెడ్డి గార్డెన్స్‌లో మహిళలకు సంక్రాంతి రంగోలి పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ కాలనీల మహిళలు ఉత్సాహంగా పాల్గొని ముగ్గులు వేశారు. పోటీల సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన మహేశ్వరం నియోజకవర్గ బిజెపి ఇంఛార్జి, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందెల శ్రీరాములు యాదవ్ విజేతలైన మహిళలు శైలజ, సంధ్య, స్వాతిలకు బహుమతులను అదే విధంగా పలువురికి ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో వి.ధీరజ్‌రెడ్డి, రామిడి వీరకర్ణారెడ్డి, జక్కిడి జంగారెడ్డి, నిమ్మల శ్రీకాంత్‌గౌడ్, రాళ్లగూడెం రామకృష్ణారెడ్డి, శశివర్ధన్‌రెడ్డి, మమత, పావని, ఆనందం, రవీందర్‌రెడ్డి, సురేష్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

# 12న కరణ్‌బాగ్ మల్లన్న స్వామి కళ్యాణ మహోత్సవం



మల్లన్న స్వామి దేవాలయం చిత్రంలో స్వామివారి మూలవిరాట్టు

**సైదాబాద్, జనవరి 9 ప్రభాతవార్త:** సైదాబాద్ డివిజన్ కరణ్‌బాగ్‌లోని శ్రీ మల్లిఖార్జున స్వామి దేవాలయం స్వామి వారి కళ్యాణ మహోత్సవానికి ముస్తాబవుతుంది. మల్లన్న స్వామి కళ్యాణమహోత్సవాన్ని ఈ నెల 11వ తేది బుధవారం నుంచి 13వ తేది శుక్రవారం వరకు ఘనంగా నిర్వహించనున్నారు. 11వతేది బుధవారం మేలుకొలుపు, అభిషేకము, బిల్వార్చన, శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతం, గంగతెప్ప, శ్రీ మల్లన్న స్వామి వారి ఊరేగింపు, 12వ తేది మేలుకొలుపు, కొట్నం, శ్రీ బలిజ మేడలాదేవి, శ్రీ గొల్లకేతమ్మ సమేత శ్రీ మల్లన్న స్వామివారికళ్యాణము, అన్నదానం, అగ్నిగుండాలు, గొలుసు తెంపడం, 13వ తేది శుక్రవారం శ్రీ రేణుకా ఎల్లమ్మ, శ్రీ నల్ల పోచమ్మ శ్రీ మహంకాళి అమ్మవార్లకు బోనాల సమర్పణ తదితర కార్యక్రమాలను ఘనంగా నిర్వహించనున్నారు. ఒగ్గు పూజారి మారయ్య బృందంచే ఈ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. సంక్రాంతి నుంచి ఉగాది వరకు ప్రతి ఆదివారం మల్లన్న స్వామికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించబడుతాయని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

# మీర్‌పేట్ కార్పొరేషన్‌లో కంటి వెలుగును విజయవంతం చేయాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న మేయర్, డిప్యూటీ మేయర్

**సరూర్‌నగర్, జనవరి 9 ప్రభాతవార్త:** మీర్‌పేట్ కార్పొరేషన్‌లో కంటి వెలుగు కార్యక్రమాలను విజయవంతం చేయాలని మేయర్ ముడావత్ దుర్గదీప్‌లాల్‌చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డిలు పిలుపునిచ్చారు. సోమవారం కార్పొరేషన్ మీటింగ్ హాల్‌లో కంటి వెలుగు కార్యక్రమంపై అవగాహన సదస్సును ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిఎం కెసిఆర్ ప్రవేశపెట్టిన కంటి వెలుగు కార్యక్రమం ప్రజలకు వరం లాంటిదన్నారు. ఈ నెల 18వ తేదీ నుండి ప్రారంభం కానున్న ఈ కార్యక్రమాన్ని కార్పొరేషన్‌లో విజయవంతం చేయడానికి కార్పొరేటర్లు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కమీషనర్ చిట్టి నాగేశ్వర్‌రావు, డిఇఇ గోపీనాథ్, మీర్‌పేట్ పిహెచ్‌సి వైద్యాధికారిణి డాక్టర్ భవ్యారెడ్డి, టిఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ అర్కల భూపాల్‌రెడ్డి, పలువురు కార్పొరేటర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ఆండాల్ నిలయంలో వైభవంగా దీపోత్సవం : నిర్వాహకులు లక్ష్మీదేవి



పూజలు నిర్వహిస్తున్న లక్ష్మీదేవి

**వనస్థలిపురం, జనవరి 9 ప్రభాతవార్త:** మూసారాంబాగ్ ఆండాల్ నిలయంలో వైభవంగా దీపోత్సవ వేడుకలు వైభవంగా జరిగాయి. అదే విధంగా భక్తులతో స్వామి, అమ్మవార్లకు ఘనంగా కర్పూర నీరాజనాలు సమర్పించి మంగళశాసనం అందించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు లక్ష్మీదేవి మాట్లాడుతూ ధనుర్మాస ఉత్సవాలలో భాగంగా ప్రతిరోజు పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అదే విధంగా ప్రతిరోజు శ్రీమాన్ అప్పన్ కందాడై లక్ష్మణమూర్తి స్వామివారితో ప్రవచనాలు జరుగుతున్నాయి. భక్తులు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

## వచ్చే ఎన్నికలలో రాష్ట్రంలో జనసేన పోటీ



సమావేశంలో మాట్లాడుతున్న శంకర్‌గౌడ్

**వనస్థలిపురం, జనవరి 9 ప్రభాతవార్త:** అగ్ర హీరోగా ఉండి ప్రజా సేవ చేయాలనే ఉద్దేశ్యంతో పవన్ కళ్యాణ్ జనసేన పార్టీ స్థాపించారని ఆ పార్టీ రాష్ట్ర ఇంఛార్జి నేమూరి శంకర్‌గౌడ్ పేర్కొన్నారు. ఎల్బినగర్ కో ఆర్డినేటర్ సాయిశిరీష పొన్నూరు ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి వనస్థలిపురంలోని ఓ కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన జనసేన ఎల్బినగర్ కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ రాబోయే ఎన్నికలలో తెలంగాణాలో పోటీ చేస్తామన్నారు. ఏ పార్టీలో లేని విధంగా జనసేన పార్టీలో సభ్యత్వం తీసుకున్న వారికి రూ. 5 లక్షల భీమాసౌకర్యం కల్పించామన్నారు. సంక్రాంతి తర్వాత నియోజకవర్గంలో జనచైతన్య యాత్రలు నిర్వహిస్తామని, గడప గడపకు వెళ్లి పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పొలిట్ బ్యూరో సభ్యులు అర్హంఖాన్, సంతోష్‌రెడ్డి, కావ్య, వెంకటసాయిప్రసాద్, తోట హన్మంతరావు, దామోదర్‌రెడ్డి, ఆర్.ప్రవీణ్, శ్రీరాములు, గాదె సుబ్బారావు, బాలాజీ నాయుడు, బద్రీనాథ్, లిఖిత, శ్యాం, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

## ఆడపిల్లల సంక్షేమానికి కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కార్పోరేటర్ రాధాధీరజ్‌రెడ్డి

**ఎల్.బి.నగర్, జనవరి 9 ప్రభాతవార్త:** ఆడపిల్లల సంక్షేమం కోసం ప్రతిఒక్కరు కృషి చేయాలని ఆర్‌కేపురం డివిజన్ కార్పొరేటర్ రాధాధీరజ్‌రెడ్డి పేర్కొన్నారు. బేటీ బచావో బేటీ పఢావో ఆడపిల్లల శిశుసంక్షేమ కార్యక్రమం సోమవారం సరూర్‌నగర్ సర్కిల్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిహెచ్ఎంసి, పోషన్ అభియాన్ కమిటీల ద్వారా ప్రజలకు అనునిత్యం అందుబాటులో ఉండాలని సూచించారు. టోల్ ఫ్రీ నెంబర్ 181, చైల్డ్ వెల్ఫ్ ఉమేన్స్ ఫ్రీ టోల్ ఫ్రీ నెంబర్ 1039 ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపకమిషనర్ కృష్ణయ్య, పలు విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# వరంగల్ రహదారిపై ఇష్టారాజ్యంగా తవ్వకాలు..!



వరంగల్ జాతీయ రహదారిపై రోడ్డు తవ్వడంతో వాహనదారులు ఇక్కట్లు పడుతున్న దృశ్యం.

**ఉప్పల్, జనవరి 9 ప్రభాతవార్త :** ఉప్పల్ వరంగల్ జాతీయ రహదారిపై కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా తవ్వకాలు చేపడుతున్నారు. ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంలో భాగంగా ఇప్పటికే ప్రధాన రహదారికి ఇరువైపులా రోడ్డు విస్తరణ చేసిన విషయం విధితమే. ఇందులో భాగంగా రోడ్డుపై ఒక్కో వైపు డ్రైనేజీ, మంచినీటి పైప్‌లైన్లు వేస్తున్నారు. అయితే కారిడార్ నిర్మాణంలో భాగంగా పలు చోట్ల రోడ్డును ఎక్కడ పడితే అక్కడ తవ్వకాలు చేయడంతో వాహనదారులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు.ఆదివారం ఉప్పల్ విద్యుత్‌సబ్‌స్టేషన్ సమీపంలో కాంట్రాక్టర్లు అనుమతి లేకుండా రోడ్డు తవ్వకాలు చేపట్టారు. రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ కేబుల్ వైర్లు తగిలి భారీ శబ్దం వచ్చింది. దీంతో రోడ్డుపై ఏమి జరిగిందో తెలియక స్థానికులు ఆయోమయం చెందారు. జెసిబితో తవ్వకాలు చేయడంతో విద్యుత్‌వైర్లతోపాటు, మంచినీటిపైప్‌లైన్లు సైతం దెబ్బతిన్నాయి. ఉదయం గమనించిన అధికారులు పనులు చేపట్టేందుకు మరోసారి రోడ్డుమధ్యలో తవ్వకాలు చేపట్టారు. దీంతో రోడ్డుపై భారీగా ట్రాఫిక్ స్థంభించింది. ట్రాఫిక్ సిఐ మక్బూల్ జానీ ఇతర సిబ్బంది అక్కడికి చేరుకుని వాహనాలను క్రమబద్దీకరించారు. కాగా అనుమతి లేకుండా రద్దీ సమయంలో చేపడుతున్న తవ్వకాలతో స్థానికులకు కష్టాలు తప్పడంలేదు. అధికారులు స్పందించి రోడ్డును పునఃనిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

## తెలంగాణ ఏర్పాటుకు 1969 ఉద్యమకారుల పోరాటమే మూలం



సమావేశంలో మాట్లాడుతున్న సంఘం నాయకులు

**వనస్థలిపురం, జనవరి 9 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 1969 ఉద్యమకారులకు గుర్తింపు లేకుండా పోయిందని 1969తెలంగాణ ఉద్యమకారుల సంఘం నాయకులు పేర్కొన్నారు. వనస్థలిపురం డివిజన్‌లోని ప్రశాంత్‌నగర్ కాలనీలో 1969 తెలంగాణ ఉద్యమకారుల సంఘం సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షులు చక్రహరి రామరాజు తదితరులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకు 1969 ఉద్యమకారులే మూలమని, దాని స్పూర్తితోనే మలిదశ ఉద్యమంతో తెలంగాణ కలనేరవేరిందన్నారు. అయితే అప్పటి ఉద్యమకారులకు నేడు గుర్తింపులేదని, సిఎం కెసిఆర్ అపాయింట్‌మెంట్ కూడ దొరకడం లేదని ఆవేదన వ్యక్తం చేసారు. తమను తెలంగాణ సమరయోధులుగా గుర్తించాలని, అర్హులైన వారికి గౌరవప్రదమైన పెన్షన్ ఇవ్వాలని, ప్రభుత్వ, ప్రైవేటు అసుపత్రుల లో ఉచిత వైద్య సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈనెల 21న రవీంద్రభారతిలో 1969 ఉద్యమకారుల సభను నిర్వహిస్తున్నామని, పెద్ద ఎత్తున తరలిరావాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి మెచినేని కిషన్ రావు.మాజీ ఎమ్మెల్యే సుదర్శన్ రావు.వనం చంద్రమౌళి, చంద్రారెడ్డి, కృష్ణమూర్తి. లక్ష్మారెడ్డి, మోహనరావు పాల్గొన్నారు.

## అంధత్వ రహిత రాష్ట్ర లక్ష్య సాధనకు కృషి

**తుర్కయంజాల్, జనవరి 9 ప్రభాతవార్త:** అంధత్వ రహిత తెలంగాణ రాష్ట్ర లక్ష్య సాధనలో భాగంగా తుర్కయంజాల్ మున్సిపాలిటీలోని 24 వార్డులలో జనవరి 18వ తేదీనుండి ఏప్రిల్ 6వ తేదీవరకు 2వ విడత కంటి వెలుగు కార్యక్రమం చైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనురాధ రామిరెడ్డి, కమిషనర్ ఎంఎన్ఆర్ జ్యోతి ఆదేశాలతో అన్ని వార్డులలో నిర్వహించబడుతుందని ఈ సదవకాశాన్ని పురపాలక ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ నరసింహ, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

# జీవో 59 పేరుతో పేదల రక్తం తాగుతున్న టిఆర్ఎస్ ప్రభుత్వం

**నేరేడ్‌మెట్, జనవరి 9 ప్రభాతవార్త:** జీవో 59 పేరుతో సామాన్య ప్రజలరక్తం తాగడానికి టిఆర్ఎస్‌ప్రభుత్వం చూస్తుందని బీజెపి జవహర్‌నగర్ మున్సిపల్ అధ్యక్షులు రంగు శంకర్ పేర్కొన్నారు. సోమవారం జవహర్‌నగర్ మున్సిపల్ కార్యాలయంలో జీవో 59పై వివరణ ఇవ్వాలని కోరుతూ బీజెపి నాయకులతో కలసి మున్సిపల్ కమీషనర్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెగ్యులరైజేషన్ కోసం దరఖాస్తు చేసుకున్న జవహర్‌నగర్ ప్రజలకు 2014లో స్థలంవిలువకు భిన్నంగా ప్రస్తుతం ఉన్న విలువకురేటు కట్టి లక్షల రూపాయల్లో డిమాండ్ నోటీసులు ఇవ్వడాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. అంతేకాకుండా జవహర్‌నగర్ ప్రధాన రహదారి పూర్తిగా చెత్త లారీలతో నిండి పూర్తిగా కాలుష్యం ఏర్పడి వింత రోగాల బారిన పడుతున్నట్లు తెలిపారు. చెత్త లారీలను అక్కడికి రాకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బీజెపి నాయకులు కమల్, మహేశ్వరి గౌడ్, రామ్ నాయక్, వేపుల సన్నీ, రాఘవేంద్రచారి, లక్ష్మిరెడ్డి, స్వర్ణలత, ఖైరున్నీస, బొమ్మ యాదగిరి, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

# వేదామృతం పేరు తొలగించాలి

**ఎల్.బి.నగర్, జనవరి 9 ప్రభాతవార్త:** వేదాలను కించపరిచే విధంగా వేదామృతంపేరిట పెట్టిన పేరును వెంటనే తొలగించాలని రాష్ట్ర బ్రాహ్మణ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం తెలంగాణ బ్రాహ్మణ పరిషత్ చైర్మన్ కెవి.రమణాచారికి బ్రాహ్మణ సంఘం నాయకులు వినతి పత్రాన్ని అందజేశారు. మీరా హాట్ మద్యం కేంద్రం వేదామృతం పేరిట ప్రారంభిస్తున్నట్లు మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ప్రకటించారని ఈ విషయమై ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకొని వేదామృతం పేరును తొలగించాలని కోరారు. అదేవిధంగా హైందవ ధర్మాన్నే కాకుండా సాక్షాత్తు బాసర సరస్వతి అమ్మవారిని, అయ్యప్ప స్వామి జననంపై కూడా నీచమైన భాషలో దుర్భాషలు ఆడిన బైరి నరేష్ అనే యువకుడిని చితకబాది పోలీస్‌స్టేషన్‌లో అప్పగించామని, ఇలాంటి చట్ట వ్యతిరేకమైన పనులు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ ప్రతినిధులు చింతపల్లి మంగపతిరావు, వక్కలంక శ్రీనివాసరావు, గాడిచర్ల నాగేశ్వరసిద్ధాంతి, కళ్లెం గిరి ప్రసద్‌శర్మ, గోగులపాటి కృష్ణమోహన్, మంగు రాఘవ రావు, ప్రమోద్, జెవిఎల్ఎన్‌రావు పాల్గొన్నారు.

# మహిళలకు రక్షణగా షీ' టీమ్ బృందాలు : కమిషనర్ చౌహాన్



ఎల్బీనగర్‌లోని షీ టీమ్స్ కార్యాలయంలో మహిళా పోలీసు అధికారులు, సిబ్బందితో కమీషనర్ డి.ఎస్ చౌహాన్..

**నేరెడ్‌మెట్, జనవరి9 ప్రభాతవార్త:** మహిళల రక్షణ కొరకు షీ టీమ్ బృందాలు ఎంతగానో పనిచేస్తున్నాయని రాచకొండ పోలీస్ కమీషనర్ డి.ఎస్ చౌహాన్ పేర్కొన్నారు. సోమవారం రాచకొండ పోలీస్ కమీషనరేట్ పరిధిలోని ఎల్బినగర్ షీ టీమ్ కార్యాలయాన్ని ఆయన సందర్శించి వారి పనితీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన షీ టీమ్స్ ఎంతో మంది మహిళలు, యువతులకు రక్షణగా నిలిచిందన్నారు. 2023 సంవత్సరంలో మహిళలు, బాలికల భద్రత కోసం 7వ తరగతి నుండి విశ్వ విద్యాలయాల వరకు అన్ని విద్యా సంస్థల్లో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రతి కళాశాల నుండి ఇద్దరు తెలివైన బాలికలను గుర్తించి వారికి షీ టీమ్స్‌లో శిక్షణ ఇప్పిస్తామన్నారు. ఈవ్ టీజర్ల పట్ల కఠినంగా వ్యవహరించాలని, వారిపై ఏమాత్రం సహనం ప్రదర్శించవద్దన్నారు. ఈవ్ టీజర్లను పట్టుకోవడానికి,మహిళలు, యువతులకు సురక్షితమైన వాతావరణాన్ని అందించడానికి నిరంతరం పెట్రోలింగ్ నిర్వహిస్తామన్నారు. గత 3 రోజులుగా షీ టీమ్ ప్రత్యేక డెకాయిలు నిర్వహించి సుమారు 50మంది ఈవ్ టీజర్లను పట్టుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో షీ టీమ్స్ డీసిపి సలీమా, ఏసిపి వెంకట్‌రెడ్డి, మహిళా కానిస్టేబుళ్ళు పాల్గొన్నారు.

# డివిజన్‌లో అభివృద్ధి పనుల కోసం మంత్రికి కార్పొరేటర్ మల్లేష్ వినతి



మంత్రికి వినతి పత్రం సమర్పించిన కార్పొరేటర్ మల్లేష్

**సరూర్‌నగర్, జనవరి 9 ప్రభాతవార్త:** మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ లోని 36వ డివిజన్‌లో అభివృద్ధి పనులు జరిపించాలని స్థానిక కార్పొరేటర్ ఎడ్ల మల్లేష్‌ముదిరాజ్ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డిని కోరారు. ఈ మేరకు ఆయన మంత్రిని ఆమె నివాసంలో కలిసి ఒక వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన డివిజన్‌లో అభివృద్ధిలో వెనుకబడి ఉందనీ, పలు సమస్యలు పరిష్కారానికి నోచుకోవడంలేదని వివరించారు. ఈ మేరకు అభివృద్ధి పనులుజరిపించి సమస్యలను తీర్చాలని మంత్రిని కోరారు. కాగా తన వినతికి మంత్రి సానుకూలంగా స్పందించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేసి కృతజ్ఞతలు తెలిపారు.

## బహుజన సాహిత్య అకాడమి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రమేష్‌ముదిరాజ్



రమేష్ ముదిరాజ్‌కు నియామకపు పత్రాన్ని నల్ల రాధాకృష్ణ

**నాచారం, జనవరి 9 ప్రభాతవార్త:** బహుజన సాహిత్య అకాడమీ (బిఎస్ఏ) తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సితారామ కాలనీకి చెందిన గంగాదేవి రమేష్‌ముదిరాజ్‌ను నియమిస్తూ అకాడమి జాతీయఅధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ నియామకపు పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నల్లరాధాకృష్ణ మాట్లాడుతూ రమేష్‌ముదిరాజ్ పరిధిలోకి వచ్చే ఆయా ప్రాంతాల్లో నూతన కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. సామాజిక పరివర్తన ఉద్యమ మార్గ దర్శకులు లైన భగవాన్ బుద్ధ, మహాత్మ జ్యోతిరావుపూలే, బి.ఆర్. అంబేద్కర్, కాన్షిరామ్ ఆశయాలకనుగుణంగా పనిచేయాలని వారి సిద్ధాంతాన్ని ప్రజల్లోకి తీసుకుపోవాలని సూచించడం జరగిందన్నారు. అనంతరం రమేష్ ముదిరాజ్ మాట్లాడతూ ఎస్సీ, ఎస్టీ మైనార్టీ, బీసీ మైనార్టీ సాహిత్య కారులను, ఉద్యమ కారులను ప్రోత్సహించేందుకు కృషి చేస్తానని చెప్పారు.

# ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థులకు న్యాయం చేసేవరకు పోరాటం

**మలక్‌పేట, జనవరి 9 ప్రభాతవార్త:** ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థుల సమస్యలు పరిష్కరించాలని ఛలో ప్రగతి భవన్ సందర్భంగా ఎఐఎస్ఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ చైతన్య యాదవ్‌ను ముందస్తు అరెస్ట్ చేసి మలక్‌పేట్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా చైతన్య మాట్లాడుతూ ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఛలో ప్రగతిభవన్ కార్యక్రమానికి బయలుదేరిన వందలాది ఎఐఎస్ఎఫ్ నాయకులను రాష్ట్ర వ్యాప్తంగా అరెస్ట్ చేసారని వారిని రాష్ట్రప్రభుత్వం వెంటనే విడుదల చేయాలనీ డిమాండ్ చేసారు. సమస్య పరిష్కారమయ్యే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని తెలిపారు.

## దళితుల సంక్షేమానికి కృషి : రాంచందర్



నియామకపు ఉత్తర్వులను అందజేస్తున్న రాంచందర్

**మలక్‌పేట, జనవరి 9 ప్రభాతవార్త:** దళితులకు ఎళ్లవేళలా అందుబాటులోఉండి వారి సంక్షేమానికి కృషి చేస్తామని రాష్ట్ర దళిత ఐక్య వేదిక సమితి అధ్యక్షుడు, ఫౌండర్ మైలపాక రాంచందర్ పేర్కొన్నారు. దళిత ఐక్యవేదిక సమితి హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు బాకరం యాదగిరి ఆధ్వర్యంలో నూతన కమిటీలను ఏర్పాటు చేయగా మూసారాంబాగ్‌లో జరిగిన కార్యక్రమంలో రాంచందర్ నియామకపు ఉత్తర్వులను అందజేశారు. నగర అధ్యక్షురాలిగా కె.అపర్ణ, ఉపాధ్యక్షురాలిగా పెంటల నర్సమ్మ, ప్రధాన కార్యదరిగా ఆండాలు, నియోజకవర్గ అధ్యక్షుడిగా కందుల ఉపేందర్, మహిళా అధ్యక్షురాలిగా కల్లెపల్లి రాణి, మూసారాంబాగ్ డివిజన్ అధ్యక్షులుగా అనిల్, మహిళాధ్యక్షురాలిగా జంగిడి అంజమ్మ, గ్రేటర్ అధ్యక్షుడిగా పెంటల యాదయ్యలను నియమించామని రాంచందర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గంట సుదర్శన్, పొలెపాక ఎంకన్న, జంగిడి కుమార్, ఎల్లప్ప, అజయ్ తదితరులు పాల్గొన్నారు.